జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

కృష్ణ సోమవారం 22 జూన్ 2026 సంపుటి : 01 సంచిక :158 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం: జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, ఉత్సవము: ఆరుద్ర కార్తె, సూర్య చంద్రుల సమయాలు, సూర్యోదయం : 5:27 సూర్యాస్తమయం : 6:31, చంద్రోదయం : 12:17 చంద్రాస్తమయం : 12:30, పంచాంగం : తిథి : శుద్ధ అష్టమి రా. 7:31 వరకు, తర్వాత నవమి, నక్షత్రం : ఉత్తర మ. 2:44 వరకు, తర్వాత హస్త, యోగం : వ్యతీపాత మ. 3:09 వరకు, తర్వాత వరీయాన్, కరణం: భద్ర ఉ. 7:45 వరకు, తర్వాత బవ రా. 7:31 వరకు, తర్వాత బాలవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# గ్రామ గ్రామాన యోగా మందిరాలు






## బాబా రామ్‌దేవ్‌తో కలిసి సీఎం చంద్రబాబు యోగాసనాలు

## తిరుపతిలో యోగాంధ్ర--2027

## అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి**

ఇంటింటికీ యోగా... సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తోందని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాల్లో యోగా మందిరాలను నిర్మిస్తామని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆదివారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో సీఎం చంద్రబాబు - మిగతా3లో



# ప్రపంచ శాంతికి యోగా మార్గం చూపుతుంది

- అన్ని వయసుల వారు ఆచరించాలి
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగాసనాలు
- ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపు



# శంషాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు..

## హాజీలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఫరూక్

**గుంటూరు**

తెలంగాణలోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన ఆంధ్రప్రదేశ్ హాజీలకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఫరూక్ కు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్రా యాత్రకు వెళ్లిన ప్రతి యాత్రికుడికి హసన్ భాష అభినందనలు తెలిపారు. యాత్రికులందరూ సురక్షితంగా వెళ్లి, తమ ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా స్వదేశానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఉమ్రా యాత్ర వారి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, ఆధ్యాత్మిక సంతప్తిని నింపాలని ఆయన ప్రార్థించారు. ఈ సందర్భంగా యాత్రికులు దేశం, రాష్ట్రం అభివద్ధి చెందాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని ప్రార్థించాలని హసన్ భాషా కోరారు.

# ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

- రేపటి నుంచి శ్వేతపత్రాలు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
- 10 అంశాలపై రిపోర్టులు సిద్ధం
- రెండేళ్లలో చాలా శాఖల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చాం
- సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాలు, గవర్నెన్స్‌లో తెచ్చిన సంస్కరణలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది



**అమరావతి**

ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రజా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై 'ప్రోగెస్ రిపోర్ట్ 2024-26' పేరుతో విడుదల చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులను ఆదేశించారు. 2024లో అధికారం చేపట్టిన వెంటనే గత ప్రభుత్వ పాలనలో జరిగిన విధ్వంసంపై ఇచ్చిన 7 శ్వేత పత్రాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులా ఈ ప్రోగ్రెస్ రిపోర్టులు ఉండాలన్నారు. 7 శ్వేత పత్రాలతో పాటు... మరో 3 ముఖ్యమైన అంశాలపై ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదల చేయాలని నిర్ణయించారు. ప్రోగ్రెస్ రిపోర్టుల విడుదలపై మంత్రులు, అధికారులతో క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సమీక్షించారు. రెండేళ్ల క్రితం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, - మిగతా3లో



## ప్రశాంతంగా పూర్తైన నీట్-యూజీ రీఎగ్జామ్

- 20 లక్షలకుపైగా అభ్యర్థులు హాజరు
- దేశవ్యాప్తంగా 551 నగరాల్లో 5,440 కేంద్రాల్లో నీట్ పరీక్ష
- విదేశాల్లోని 14 సెంటర్లలో పరీక్ష నిర్వహణ

## నేవీ అమ్ములపొదిలో కొత్త అస్త్రాలు

- ఐఎన్ఎస్ దునగిరి, సంశోధక్, అగ్రయ్ శక్తిసామర్థ్యాలు ఇవే!
- భారత నావికాదళ సరికొత్త యుద్ధనౌకలు
- ఐఎన్ఎస్ దునగిరి, సంశోధక్, అగ్రయ్ పూర్తి వివరాలు మీ కోసం!



# యోగా నాకు చాలా ఇచ్చింది

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- యోగతోనే తనకు లోతైన స్పష్టత, పరిపక్వత లభించాయని చెప్పిన పవన్ కల్యాణ్
- తన దినచర్యలో క్రియ యోగ, అష్టాంగ యోగ అంతర్భాగమని వెల్లడి
- యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

**అమరావతి**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. ప్రతి ఒక్కరూ యోగాను - మిగతా3లో



# ప్రపంచ శాంతికి యోగా మార్గం చూపుతుంది

యోగా ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక ఉత్సవంగా మారిందని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. ఏడాదిలో సుదీర్ఘమైన రోజు అయినందునే జూన్ 21న ప్రపంచ యోగాదినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. యోగాను కేవలం కొన్ని ప్రత్యేక సందర్భాలకే పరిమితం చేయకుండా జీవితంలో భాగంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలోని రెడ్ రోడ్ వేదికగా జరుగుతున్న కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే పరిమితం కాదని, ప్రపంచ శాంతికి కూడా మార్గం చూపగలదని, అన్ని వయసుల వారు యోగాను ఆచరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'జూన్ 21 భూమిపై కొంతభాగంలో ఏడాదిలోనే సుదీర్ఘమైనరోజు. అంతర్జాతీయ యోగా దినోత్సవం కారణంగా ఈ రోజు విశ్వంలోనే అతిపెద్ద సామూహిక కార్యక్రమంగా నిలుస్తోంది. విశ్వంలోని వేర్వేరు భాగాల్లో యోగాకు సంబంధించి ఒకదానిని మించి మరొకటి అనే విధంగా అద్భుతచిత్రాలు వస్తున్నాయి. దేశంలో హిమాలయాల నుంచి హిందూ మహాసముద్రం వరకు, తూర్పున బంగాల్ నుంచి పశ్చిమాన సౌరాష్ట్ర వరకు దేశమంతా యోగాశక్తితో చైతన్యవంతంగా కనిపిస్తోంది. యోగాను కేవలం ప్రత్యేక సందర్భాలకు మాత్రమే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జీవనశైలి వ్యాధులు, మానసిక ఒత్తిడి, అంటురాని వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో యోగ ఆరోగ్యకరమైన జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తోంది' అని మోదీ పేర్కొన్నారు.



'70 ఏళ్లలోనూ ఆరోగ్యంగా ఉండాలి'

"ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అంటే వయస్సు పైబడినా సామర్థ్యం తగ్గకూడదు. యోగా మన జీవితం నిరంతర వృద్ధి చెందేలా చేస్తుంది. 20 ఏళ్ల వయసులో ఉన్నదానికంటే 40 ఏళ్లలో మరింత శరీర సౌలభ్యాన్ని కలిగి ఉండాలి. 30 ఏళ్ల వయసుతో పోలిస్తే 50 ఏళ్లలో మరింత ఉత్సాహంగా ఉండాలి. 50ఏళ్లలో కంటే 70ఏళ్ల వయసులో మరింత రోగ నిరోధకత కలిగి ఉండాలి. అందుకు యోగా సహాయపడుతుంది. మన శరీరాన్ని అనువుగా, మన శక్తిస్థాయిలు అధికంగా ఉండేందుకు యోగా సాయపడుతుంది. అలాగే ప్రశాంతమైన, ఒత్తిడి లేని జీవితం గడపడానికి కూడా సాయపడుతుంది. జీవనశైలి వల్ల వచ్చేరోగాలను దూరం చేస్తుంది. అంతేకాకుండా జీవితకాలం నిత్య విద్యార్థిగా ఉండాలని యోగా బోధిస్తుంది. మన గురించి మనం ఎంత ఎక్కువ తెలుసుకుంటే మనల్ని మనం అంత మెరుగ్గా మలుచుకోగలం. అందుకే ఆరోగ్యకరమైన వృద్ధాప్యమనే యోగా థీమ్ కేవలం వయసు పైబడినవారికే కాదు. అన్ని వయసుల వారికీ సంబంధించినదని భావించాలి." ఈ కార్యక్రమంలో బంగాల్ గవర్నర్ ఆర్?ఎన్? రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, ఆయుష్ శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ తదితరులు పాల్గొన్నారు. వేలాది మంది యోగా సాధకులతో కలిసి ప్రధాని మోదీ ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా ఉండాలనే థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మోదీ తెలిపారు.

**ప్రపంచవ్యాప్తంగా 2,500 ప్రాంతాల్లో వేడుకలు**

ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,500 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. 210కు పైగా భారత రాయబార కార్యాలయాలు, దౌత్య మిషన్లు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. ఆరోగ్యం, సామరస్యం, సమష్టి సంక్షేమానికి యోగ ఒక ప్రపంచ ఉద్యమంగా మారిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రపంచ జనాభాలో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యవంతమైన, చురుకైన జీవనశైలిపై అవగాహన పెంచడంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంది.

**యోగా దినోత్సవానికి ప్రపంచ గుర్తింపు**

ప్రధాని నరేంద్ర మోదీ 2014లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు 175 దేశాలు మద్దతు తెలిపాయి. అనంతరం 2015 జూన్ 21న తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించబడింది. అప్పటి నుంచి యోగ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, సమగ్ర జీవనానికి ప్రతీకగా మారి కోట్లాది మందిని ఒకే తాటిపైకి తీసుకొస్తోంది.

# ప్రశాంతంగా పూర్తైన నీట్-యూజీ రీఎగ్జామ్

ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ 2026 రీ-ఎగ్జామ్ విజయవంతంగా ముగిసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారికంగా ప్రకటించింది. మన దేశంలోని 5,440 కేంద్రాలతో పాటు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. హిందీ, ఇంగ్లీష్?తోపాటు మొత్తం 13 భాషల్లో ఈ పరీక్ష జరిగిందని ఎన్‌టీఏ పేర్కొంది. దేశవ్యాప్తంగా పలు ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి వల్లే ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించగలిగామని ఎన్‌టీఏ తెలిపింది. ఈ పరీక్షలో 10వేల మందికిపైగా దివ్యాంగులైన అభ్యర్థుల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశామంది. అలాగే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న సుమారు 81 మంది అభ్యర్థుల కోసం ప్రత్యేక నిబంధనలు అమలు చేసినట్లు వెల్లడించింది. వీరిలో రోడ్డు ప్రమాదం నుంచి కోలుకుంటున్న ఒక విద్యార్థి, అలాగే కీమోథెరపీ చికిత్స పొందుతున్న మరొక విద్యార్థి కూడా పరీక్షకు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొంది.

**భారీ భద్రత ఏర్పాట్లు**

పరీక్షను పారదర్శకతను పెంచేందుకు, భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్, ముఖ గుర్తింపు విధానాన్ని ఉపయోగించారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీటీవీ మానిటరింగ్, సిగ్నల్ జామర్లు, రాష్ట్ర పోలీసుల సహకారంతో రెండు అంచెల తనిఖీలను అమలు చేశారు. సీసీటీవీ విజువల్స్‌ను నిరంతరం పర్యవేక్షించేందుకు ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయం, విద్యామంత్రిత్వశాఖ, ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 34 కేంద్ర విద్యా సంస్థలు, అలాగే అన్ని రాష్ట్రాలు, జిల్లా కలెక్టరేట్లలో 'కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు' ఏర్పాటు చేశారు.

**20 లక్షలకు పైగా హాజరు**

నీట్ పేపర్ లీక్ తర్వాత రీ-ఎగ్జామ్‌ను కేవలం 37 రోజుల వ్యవధిలోనే ప్లాన్ చేసి నిర్వహించారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా పోలీసులు, అబ్జర్వర్లు, పరీక్ష సిబ్బందితో కలిపి దాదాపు 7 లక్షల మంది అధికారులను రంగంలోకి దించినట్లు ఏజెన్సీ వెల్లడించింది. దాదాపు 20 లక్షలకు పైగా



అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని పేర్కొంది. సాధారణ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15గంటల వరకు పరీక్ష జరగ్గా దివ్యాంగులకు సాయంత్రం 6.20గంటల వరకు పరీక్ష నిర్వహించామని తెలిపింది.

**ఫిజిక్స్ పేపర్ టఫ్‌గా ఉంది!**

కాగా, నీట్ రీ-ఎగ్జామ్‌పై అభ్యర్థుల నుంచి భిన్నమైన స్పందనలు వచ్చాయి. ఓవరాల్‌గా ప్రశ్నాపత్రం సాధారణంగానే ఉందని చాలా మంది విద్యార్థులు తెలిపారు. అయితే గత పరీక్షతో పోలిస్తే, ఈసారి ఫిజిక్స్ సెక్షన్ చాలా కఠినంగా ఉందని మరికొందరు విద్యార్థులు పేర్కొన్నారు. "పరీక్ష సాధారణంగానే ఉంది. కాకపోతే ఫిజిక్స్ పేపర్ కాస్త లెంగ్తీగా ఉంది. గతంలో కంటే కొంచం కఠినంగా అనిపించింది. అయితే బయాలజీ బాగుంది. కెమిస్ట్రీ ప్రశ్నలు సాధారణంగానే ఉన్నాయి" అని చాలా మంది చెప్పారు. మరొక అభ్యర్థి మాట్లాడుతూ, "గత పరీక్ష కంటే ఇది కొంచెం కష్టంగా అనిపించింది. ఇది నా మొదటి ప్రయత్నం. నాకు దాదాపు 500 మార్కులు వచ్చే అవకాశం ఉంది. పరీక్ష కేంద్రం లోపల ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి" అని చెప్పాడు.

**పేపర్ లీక్ వివాదం**

మే 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష పేపర్ లీకైంది. దీంతో చీూా ఆ పరీక్షను రద్దు చేసి ఇవాళ మళ్లీ నిర్వహించింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్ష సజావుగా సాగేందుకు జాతీయ పరీక్షల సంస్థ-ఎన్?టీఏ భారీ ఏర్పాట్లు చేసింది. 1.38 లక్షలకుపైగా సీసీ కెమెరాలు, 51వేలకుపైగా జామర్లను ఏర్పాటు చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిల్లీ ఓఖ్లాలోని ఎన్?టీఏ ప్రధాన కార్యాలయంలో ఉండి పరీక్ష నిర్వహణపై నిరంతరం సమీక్ష జరిపారు. కోల్‌కతా నుంచి దిల్లీ ఐజీఐ విమానాశ్రయానికి మధ్యాహ్నం ఒంటి గంటకు వచ్చిన ప్రధాని మోదీ తన వల్ల నీట్ రాసే విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదని నేరుగా ఇంటికి వెళ్లకుండా చాలా సమయం విమానాశ్రయంలోనే ఉండిపోయారు. కాగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ, ఇప్పటికే పలువురు నిందితులను అరెస్ట్ చేసింది.

## తమిళనాడులో ఘోర ప్రమాదం...

## అమ్మోనియా వాయువు లీకై ఏడుగురి మృతి

**తమిళనాడు సీఫుడ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్**

**ఈ దుర్ఘటనలో ఏడుగురు కార్మికుల మృతి**

**74 మందికి పైగా తీవ్ర అస్వస్థత, పలువురి పరిస్థితి విషమం**

**యూనిట్‌లో వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం**

**ఘటనపై పూర్తిస్థాయి విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశం**

తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో చాలా మంది 24-25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంట్యూబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

## 'నిరసన మాత్రమే చట్టవిరుద్ధమెందుకు అవుతుంది'

విద్యార్థుల బలవన్మరణాలపై ఎవరూ బాధ్యత వహించకపోతే, నిరసనను మాత్రమే చట్టవిరుద్ధమని ఎలా చెబుతారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన ఆదివారం రెండో రోజుకు చేరగా, పోలీసుల ప్రకటనపై స్పందిస్తూ ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల మరణాలు, పరీక్షల అవకతవకలపై తీవ్ర ఆందోళనలు ఉన్నప్పటికీ సంబంధిత మంత్రి పదవిలో కొనసాగడానికి ఏ నిబంధనలు అనుమతిస్తున్నాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అయితే నిరసనకు ఇచ్చిన అనుమతి గడువు ముగిసిందని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతం ధర్నా చట్టవిరుద్ధంగా పరిగణిస్తామని దిల్లీ పోలీసులు పలుమార్లు ప్రకటించారు. అయినప్పటికీ నిరసనకారులు అక్కడి నుంచి వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో పోలీసులను విద్యార్థుల బలవన్మరణాలపై ఎవరూ బాధ్యత వహించకపోతే, నిరసనను మాత్రమే ఎలా చట్టవిరుద్ధమని అభిజిత్ దీప్కే ప్రశ్నించారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, విద్యార్థుల బలవన్మరణాలు వంటి అంశాలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని మరోసారి డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రారంభమైన ఉద్యమం ఇప్పుడు సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు, యువకులు, ఉద్యమానికి మద్దతు తెలిపే ప్రజలు దిల్లీకి చేరుకుని తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. పరిపాలనా యంత్రాంగం నిరసనను విరమించుకోవాలని సూచించినప్పటికీ, నిరసనకారులు వెనక్కి తగ్గకుండా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలకు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని సీజేపీ నాయకులు చెప్పారు.

**ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పోరాటం**

శనివారం నిరసనను అనుమతి గడువు తర్వాత కొనసాగించేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో అభిజిత్ దిప్కే తన మద్దతుదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు తాను జంతర్‌మంతర్‌ను విడిచిపెట్టబోనని ప్రకటించారు. తమ ఆందోళన పూర్తిగా శాంతియుతంగా కొనసాగుతోందని, ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పోరాటం సాగిస్తామని చెప్పారు. శాంతియుత నిరసన చేపట్టడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని దీప్కే పేర్కొన్నారు. ప్రతిసారి అనుమతులు తీసుకోవాలని నిబంధనలు విధించడం ప్రజాస్వామ్య స్వేచ్ఛలను పరిమితం చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఉద్యమం ఏ ఒక్క సంస్థకో, రాజకీయ పార్టీకో సంబంధించినది కాదని, విద్యార్థుల భవిష్యత్తు కోసం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సాగుతున్న ప్రజా ఉద్యమమని వివరించారు. పోలీసు సిబ్బందిని ఉద్దేశించి కూడా అభీతే దీప్కే వ్యాఖ్యలు చేశారు. ఆ అంశాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంగా చూడాలని ఆయన కోరారు. విద్యా రంగంలో సంస్కరణలు అవసరమని, విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమంజసమేనని చాలా మంది పోలీసు సిబ్బంది వ్యక్తిగతంగా అంగీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తమ ఉద్యమానికి ప్రధాన లక్ష్యం విద్యాశాఖ మంత్రిపై బాధ్యత నిర్ధరించి, ఆయన రాజీనామా చేయించడం మాత్రమేనని మరోసారి స్పష్టం చేశారు.

# నేవీ అమ్ములపొదిలో కొత్త అస్త్రాలు

స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన మూడు అత్యంత శక్తివంతమైన నౌకలు ఆదివారం భారత నౌకాదళం అమ్ములపొదిలో చేరాయి. దీనితో మన నౌకాదళం శక్తిసామర్థ్యాలు మరింత ఇనుమడించాయి. ఐఎన్‌ఎస్ దునగిరి, ఐఎన్‌ఎస్ సంశోధక్, ఐఎన్‌ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలు 75 శాతానికి పైగా స్వదేశీ తయారీ పరికరాలతో రూపొందాయి. ఈ మూడు ఆధునిక నౌకల్లో, దేని ప్రత్యేకత దానిదే. నీటిపైనే కాదు, సముద్రపు అడుగున కూడా శత్రుభీకరంగా విరుచుకుపడే సామర్థ్యం ఐఎన్‌ఎస్ దునగిరి, ఐఎన్‌ఎస్ అగ్రయ్‌కు ఉంది. ఇక 'సముద్ర సర్వే మిషన్' కోసం సంశోధక్ రూపుదిద్దుకుంది. ఇప్పుడు వీటి గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం.

**1. ఐఎన్‌ఎస్ దునగిరి ప్రత్యేకతలు ఇవే**

ఇండియన్ నేవీ చేపట్టిన 'ప్రాజెక్టు 17ఏ' అనే ప్రోగ్రామ్‌లో భాగంగా తయారు చేసిన ఐదో నౌక 'ఐఎన్‌ఎస్ దునగిరి'. ఇది శత్రువుల రాడార్లకు చిక్కకుండా(స్టెల్త్) దాడి చేయగల ఆధునిక యుద్ధనౌక. దీనిని ఇండియన్ నేవీకి చెందిన ఒక 'వార్‌షిప్ డిజైన్ బ్యూరో' డిజైన్ చేయగా, కోల్‌కతాలోని 'గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్' నిర్మించింది. ఉత్తరాఖండ్‌లోని 'దునగిరి' అనే హిమాలయ పర్వతం పేరు దీనికి పెట్టారు. గతంలో 30 ఏళ్లకు పైగా నేవీలో పనిచేసి రిటైర్ అయిన పాత 'ఐఎన్‌ఎస్ దునగిరి' నౌక జ్ఞాపకార్థం దీనికి ఆ పేరు ఇచ్చారు.

**'ప్రాజెక్టు 17ఏ'లో భాగంగా**

గతంలో ఉన్న 'శివాలిక్' రకం యుద్ధనౌకల కంటే మెరుగైన వాటిని తయారు చేయడం కోసం 'ప్రాజెక్టు 17ఏ'ను ప్రారంభించారు. పాతతరం నౌకల స్థానంలో, హిందూ మహాసముద్రంలో అన్ని రకాల పనులు చేయగల కొత్త నౌకలను తీసుకురావాలనే ఆశయంతో ఇండియన్ నేవీ ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద నిర్మించిన ఐఎన్‌ఎస్ దునగిరి నౌక శత్రువుల కంటికి కనపడకుండా దాడులు చేయగలదు. దీనిలో అత్యాధునిక సెన్సార్లు, ఆటోమేటిక్స్ సిస్టమ్స్, శక్తిమంతమైన ఆయుధాలు ఉన్నాయి. అందువల్ల ఈ నౌక ఒకే సమయంలో శత్రు విమానాలను, ఓడలను, జలాంతర్గాములను ఎదుర్కొంటూనే, చాలా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ఈ ఐఎన్‌ఎస్ దునగిరి దాదాపు 149 మీటర్ల పొడవు ఉంటుంది. సుమారు 6,600 టన్నుల బరువు మోయగలదు. దీనికి శత్రువుల కంట పడకుండా తప్పించుకునే టెక్నాలజీతోపాటు. ఇందులో ఒక అద్భుతమైన 'కాంబాట్ మేనేజ్?మెంట్? సిస్టమ్' ఉంది. దీని సాయంతో చట్టుపక్కల ఎటువైపు నుంచి ముప్పు వచ్చినా, వెంటనే గుర్తించి దాన్ని నాశనం చేయవచ్చు. అంతేకాదు దీనిలో అధునిక రాడార్లు, నీటి లోపల వెతికే సెన్సార్లు, బ్రహ్మోస్ సూపర్ ఫాస్ట్ క్షిపణులు, గాల్లోకి దూసుకెళ్లే మిస్సైళ్లు, టార్పెడోలు (నీటిలో ప్రయోగించే బాంబులు), పెద్ద నేవల్ గన్స్ ఉన్నాయి. వీటి ద్వారా శత్రువుల ఓడలను, జలాంతర్గాములను, విమానాలను సులువుగా కూల్చేయగలదు.

**ఐఎన్‌ఎస్ దునగిరిలో వాడిన టెక్నాలజీ ఏమిటి?**

పాత ఓడలతో పోలిస్తే ఇందులో చాలా వరకు పనులు ఆటోమేటిక్‌గా జరుగుతాయి. దీని కోసం 'ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫారమ్ మేనేజ్‌మెం ట్ సిస్టమ్'ను వాడుతున్నారు. దీని వల్ల ఓడలోని ముఖ్యమైన భాగాలను ఒకే చోట కూర్చొని కంప్యూటర్ల ద్వారా సిబ్బంది ఆపరేట్ చేయవచ్చు. ఇది డీజిల్?, గ్యాస్? రెండింటితోనూ నడుస్తుంది. కమాండర్లు తమ అవసరాన్ని బట్టి తక్కువ ఇంధనంతో నడపడానికి లేదా చాలా వేగంగా దూసుకుపోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

**ఆ హెలికాప్టర్లు ఏం చేస్తాయి?**

ఈ ఎన్ఐఎస్ దునగిరి నౌకపై నుంచి హెలికాప్టర్లను కూడా నడపవచ్చు. ఈ హెలికాప్టర్లు సముద్రంలో నిఘా పెట్టడానికి, శత్రువులను వేటాడడానికి, ప్రమాదంలో ఉన్నవారిని రక్షించడానికి పనికివస్తాయి. కనకు ఈ నౌక మన నేవీలోకి రావడం వల్ల ఆరేబియా సముద్రం నుంచి పసిఫిక్? మహాసముద్రం వరకు మనం గట్టి నిఘా పెట్టవచ్చు. మన తీరప్రాంతాలను సురక్షితం చేసుకోవచ్చు. హిందూ మహాసముద్రంలో చైనా లాంటి ఇతర దేశాల నావికాదళాల కదలికలు పెరుగుతున్న సమయంలో ఈ ఐఎన్‌ఎస్ దునగిరి సేవలు మనకు ఎంతో అవసరం అని చెప్పకతప్పదు.

**2. ఐఎస్ఎస్ సంశోధక్ ప్రత్యేకతలు ఇవే**

ఐఎన్‌ఎస్ సంశోధక్‌ను సమాచారాన్ని సేకరించే ఒక సముద్రపు ల్యాబ్ అని చెప్పవచ్చు. నేవీ చేపట్టిన 'సర్వే వెసల్ లార్జ్' ప్లాన్‌లో భాగంగా తయారు చేసిన నాలుగో, చివరి నౌక ఇది. దీనిని 'నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో' డిజైన్ చేయగా, కోల్‌కతాలోని జీఆర్‌ఎస్‌ఈ సంస్థ నిర్మించింది. క్షిపణులు, బాంబులు మోసుకెళ్లే యుద్ధనౌకల్లా కాకుండా, ఈ సంశోధక్ నౌక సమాచారాన్ని సేకరిస్తుంది. సముద్రపు అడుగు భాగాన్ని మ్యాపింగ్ చేయడం, ఓడలు ప్రయాణించడానికి సురక్షితమైన మార్గాలను కనుగొనడం, సముద్రపు డేటాను సేకరించడం, నావికాదళ ఆపరేషన్లకు అవసరమైన కచ్చితమైన సమాచారాన్ని అందించడం దీని ప్రధాన విధులు.

**ఈ సర్వే నౌకల ప్రాధాన్యత ఏమిటి?**

ఆధునిక నావికా యుద్ధాలు సముద్రం లోపల ఉండే కచ్చితమైన సమాచారంపైనే ఆధారపడి ఉంటాయి. జలాంతర్గాములు, యుద్ధనౌకలు, క్షిపణి వ్యవస్థలు సరిగ్గా పనిచేయాలంటే సముద్రం అడుగు భాగం ఎలా ఉంది? నీటి లోతు ఎంత ప్రవాహాలు ఎలా ఉన్నాయి? లోపల ఏవైనా అడ్డంకులు ఉన్నాయా? మొదలైన వివరాలు చాలా అవసరం. అందుకే భారత నౌకాదళం ఐఎన్‌ఎస్? సంశోధక్? లాంటి సర్వే నౌకలను తన అమ్ములపొదిలో చేర్చుకుంది. అయితే ఇవి నావికాదళ కమాండర్లకు మాత్రమే కాకుండా, సాధారణ వ్యాపార ఓడలకు, రేవుల(పోర్టుల)కు కూడా ఎంతో ఉపయోగపడతాయి. సింపుల్‌గా చెప్పాలంటే, యుద్ధం వస్తే, మన యుద్ధనౌకలు సముద్రంలో సురక్షితంగా తిరగడానికి, ఎదురుదాడి చేయడానికి అవసరమైన సమాచారాన్ని ఇది ఇస్తుంది. అలాగే, సముద్రంలో తుపానులు వంటి విపత్తులు వచ్చినప్పుడు సహాయ చర్యల ప్లానింగ్?కు ఇవి ఉపయోగపడతాయి. సముద్ర శాస్త్ర పరిశోధనలకు, కొత్త పోర్టుల నిర్మాణానికి కూడా తోడ్పడతాయి. అవసరమైనప్పుడు ప్రజలకు మానవతా సాయం అందించడానికి, ప్రమాదంలో ఉన్నవారిని రక్షించడానికి (సెర్చ్ అండ్ రెస్క్యూ) కూడా దీనిని వాడవచ్చు.

**ఇదొక సముద్రంపై తేలియాడే ల్యాబ్?**

ఈ ఐఎన్?ఎస్? సంశోధక్?ను సముద్రంపై తేలియాడే పరిశోధనశాల (ల్యాబ్?)గా చెప్పవచ్చు. ఇందులో అత్యాధునిక సాంకేతిక పరికరాలు ఉన్నాయి. కంప్యూటర్ డేటా సిస్టమ్స్, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్? (నీటిలోపల స్వయంచాలకంగా తిరిగే చిన్న వాహనాలు), రిమోట్?తో నడిచే పరికరాలు, సముద్రపు అడుగు భాగాన్ని స్కాన్ చేసే సోనార్ సిస్టమ్స్ ఉన్నాయి. ఈ నౌక తీరప్రాంతాలతోపాటు, చాలా లోతైన సముద్రాల్లో కూడా మ్యాపింగ్ పనులు చేయగలదు. జలాంతర్గాముల ప్రయాణానికి, నేవీ ప్లాన్‌లకు ఉపయోగపడే పర్యావరణ సమాచారాన్ని కూడా ఇది సేకరిస్తుంది. ఈ ఐఎన్‌ఎస్ సంశోధక్ నౌక సుమారు 110 మీటర్ల పొడవు ఉంటుంది. ఇది 3,400 టన్నుల బరువు మోయగలుగుతుంది. గంటకు 33 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఇది రెండు ఇంజిన్లతో నడుస్తుంది. చాలా రోజుల పాటు సముద్రంలోనే ఉంటూ తన సర్వే పనులను చూసుకోగలుగుతుంది.

# అపసోపాలు పడుతున్న అమరావతి, పోలవరం

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్ల కాలపరిమితిని పూర్తి చేసుకుంది. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు ప్రధానంగా వినిపించిన నినాదం ఏ అంటే అమరావతి.. పీ అంటే పోలవరం . గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ రెండు ప్రాజెక్టులు రివర్స్ టెండరింగ్, విధానపరమైన నిర్ణయాల వల్ల పూర్తిగా నిర్వీర్యమయ్యాయనే బలమైన విమర్శల మధ్య కూటమి అధికారంలోకి వచ్చింది. కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే నాటికి అమరావతి, పోలవరం ప్రాజెక్టులు తీవ్రమైన చట్టపరమైన, ఆర్థికపరమైన, సాంకేతికపరమైన సవాళ్లతో కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనల వల్ల అమరావతిలో దాదాపు 45,000 కోట్ల విలువైన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి అడవిని తలపించాయి. అటు పోలవరంలో గైడ్ బండ్ దెబ్బతినడం, డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు భవితవ్యమే ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. మొదటి ఆరు నెలల కాలాన్ని కేవలం నష్ట నివారణ చర్యలు, నిధుల సమీకరణకే కేటాయించాల్సి వచ్చింది. రాజధాని అమరావతిని గ్లోబల్ సిటీగా మార్చే క్రమంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అద్భుతమైన ఆర్థిక పురోగతిని సాధించింది. గత ఐదేళ్ల వైఫల్యాల వల్ల దెబ్బతిన్న అంతర్జాతీయ బ్యాంకుల నమ్మకాన్ని పునరుద్ధరించడంలో చంద్రబాబు విజయవంతమయ్యారు. ప్రపంచ బ్యాంకు ఆసియా అభివృద్ధి బ్యాంకు ల నుంచి ఉమ్మడిగా 15,000 కోట్ల ప్రత్యేక రుణాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ నిధులతో గతంలో ఆగిపోయిన ఐకానిక్ నిర్మాణాలు ? సెక్రటేరియట్ టవర్స్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు ఐఏఎస్, జడ్జీల క్వార్టర్ల నిర్మాణ పనులను నూతన ఎల్‌అండ్‌టీ , షాపూర్జీ పల్లోంజీ సంస్థలకు అప్పగించి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిలో గత రెండేళ్లలో మౌలిక వసతుల కల్పన 45 శాతం మేర పూర్తయింది. గతంలో నిలిచిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. స్టార్టప్ ఏరియా అభివృద్ధి కోసం సింగపూర్ సంస్థలతో పాత ఒప్పందాలను పునరుద్ధరించడమే



కాకుండా, దాదాపు 12 జాతీయ, అంతర్జాతీయ ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు అమరావతిలో భూములు కేటాయించడం ద్వారా ఈ రెండేళ్లలోనే సుమారు 8,000 కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించగలిగారు.కూటమి ప్రభుత్వానికి అత్యంత సవాలుగా మారింది పోలవరం ప్రాజెక్టు. గత ప్రభుత్వ హయాంలో గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను పూర్తిగా పునర్నిర్మించాలా లేదా పాతదానికి మరమ్మతులు చేయాలా అనే సాంకేతిక మీమాంసకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ ద్వారా కూటమి ప్రభుత్వం తెరదించింది. దెబ్బతిన్న పాత డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్తగా దాదాపు 2,000 కోట్ల అంచనా వ్యయంతో నూతన వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో ప్రారంభించారు. కేంద్రంలో ఉన్న బీజేపీతో సఖ్యతను ఉపయోగించుకుని, పోలవరం మొదటి దశ పూర్తి చేయడానికి కేంద్ర మంత్రివర్గం ద్వారా 12,157 కోట్ల అదనపు నిధుల ప్యాకేజీని కూటమి ప్రభుత్వం మంజూరు చేయించుకోగలిగింది. ఈ రెండేళ్ల కాలంలో పోలవరం ప్రధాన డ్యామ్ పనులు, స్పిల్‌వే రేడియల్ గేట్ల అమరిక 85 శాతం పూర్తయింది. కుడి, ఎడమ కాలువల లైనింగ్ పనులు, టన్నెల్ పనులలో గత రెండేళ్లలో 22 శాతం అదనపు పురోగతి నమోదైంది. అత్యంత క్లిష్టమైన 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని పునరావాస ప్రక్రియ కోసం సుమారు 5,000 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంది.అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఖజానా ఖాళీగా ఉండటం, భారీగా ఉన్న అప్పుల భారం వంటి అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం అమరావతి - పోలవరం ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. గడిచిన రెండేళ్ల డేటాను పరిశీలిస్తే.. ప్రచార ఆర్భాటాల కంటే క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల పునరుద్ధరణ, కేంద్రం నుంచి నిధుల రాకపైనే ప్రభుత్వం ఎక్కువ విజయం సాధించిందని స్పష్టమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన అడ్డంకులను అధిగమించి చూపిస్తున్న ఈ పురోగతి.. రాబోయే మూడేళ్లలో ఏపీ అభివృద్ధి రథాన్ని మరింత వేగంగా ముందుకు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని ప్రజలు నమ్మకంతో ఉన్నారు.

# డీఎస్సీ డ్యామేజ్ ఎవరికి...

**విజయవాడ :** డీఎస్సీ 2025 విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి షాక్ తప్పలేదు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలు అనేక రకాల అవకతవకలు జరిగాయని గత కొద్ది రోజులుగా ఆరోపణలు చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. జగన్మోహన్ రెడ్డి అయితే తన పక్కన డీఎస్సీ అభ్యర్థులను పెట్టుకుని మరి ఆరోపణలు చేస్తూ వచ్చారు. అయితే ఈ విషయంలో అనుకున్న స్థాయిలో వైసీపీకి ప్రజల్లో మైలేజ్ దక్కలేదు. అలా దక్కలేదు సరి కదా తిరిగి డ్యామేజ్ జరిగింది. దానికి కారణం లేకపోలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు మాదిరిగా కూటమి నుంచి ఎదురుదాడి రాలేదు. ఒక పద్ధతి ప్రకారం అధికారులు మీడియా ముందుకు వచ్చి సుదీర్ఘ వివరణలు ఇచ్చారు. ప్రతి అంశంపై స్పష్టత ఇచ్చారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. ఇదంతా రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ప్రయత్నం గా ప్రజలు ఒక అంచనాకు వచ్చారు. అందుకే లైట్ తీసుకుంటున్నారు. మరికొందరైతే అసహ్యించుకుంటున్నారు వైసీపీ తీరుపై. ఎప్పటికప్పుడు స్టాండ్ మార్చుతూ.. డీఎస్సీ విషయంలో వైసిపి ఒక స్టాండ్ తో ముందుకు వెళ్లలేదు. రకరకాల ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూసింది. వైసీపీ నుంచి వచ్చిన ఆరోపణలకు కూటమి నేతలు కౌంటర్ ఇచ్చి ఉంటే అది రాజకీయ రగడగా మారి ఉండేది. అందుకే ప్రభుత్వం వ్యూహాత్మకంగా విద్యాశాఖ ఉన్నతాధికారులను రంగంలోకి దించింది. సాక్షి మీడియాలో వచ్చిన వ్యతిరేక కథనాలను కేస్ స్టడీస్ గా తీసుకుంటూ ఒక్కో అనుమానాన్ని నివృత్తి చేశారు. ఎంతో ఓపికగా అధికారులు సమాధానాలు చెప్పారు. దీంతో ఆదిలోనే దానికి కౌంటర్ ఇవ్వగలిగారు అధికారులు. సోషల్ మీడియాలో అధికారులు ఇచ్చే కౌంటర్ ఎక్కువగా ప్రజల్లోకి వెళ్ళింది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు తేలిపోయాయి. లోకేష్ సవాల్ తో.. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వద్ద ఆధారాలు ఉంటే కచ్చితంగా న్యాయస్థానాన్ని సంప్రదించవచ్చు అని ప్రభుత్వ వర్గాలు




సలహా ఇచ్చాయి. అది కూడా ప్రజల్లోకి వెళ్ళింది. వైసీపీ నేతలు ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు అంటూ ప్రజలు ఒక నిర్ధారణకు కూడా వచ్చారు. అక్కడితో ఆగలేదు. మళ్లీ కమ్మ డీఎస్సీ అంటూ చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ కోటాలో కమ్మ సామాజిక వర్గం వారికి అధిక అవకాశాలు కల్పించారు అంటూ ఆరోపణలు చేశారు. దానిని కూడా నివృత్తి చేసింది విద్యాశాఖ. రెడ్డి సామాజిక వర్గానికి 10 పోస్టులు, కాపు సామాజిక వర్గానికి 16 పోస్టులు ఇస్తే కమ్మ సామాజిక వర్గానికి మాత్రం 9 పోస్టులు కేటాయించినట్లు చెప్పుకొచ్చారు. ఆ విషయంలో కూడా ఆ పార్టీకి షాక్ తప్పలేదు. చివరిగా లోకేష్ సాహసించి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పుడు చర్యలను తప్పుపడుతూ.. అవసరం అనుకుంటే జగన్మోహన్ రెడ్డి తనతో చర్చకు రావాలంటూ సవాల్ చేశారు. దానికి సై అనలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. లక్ష్మీపార్వతి తో పాటు యాంకర్ శ్యామల లాంటి వారిని పంపించారు. మరోసారి డీఎస్సీ విషయంలో చతికిల పడ్డారు. ఈ మొత్తం పరిణామాలతో ప్రజలు ఒక నిర్ధారణకు వచ్చారు. డీఎస్సీ విషయంలో వైసిపి కుట్ర చేస్తుంది అనే అనుమానాలను ఎక్కువమంది నమ్మారు. అంతిమంగా ఇప్పుడు ఈ డీఎస్సీ అంశం అనేది వైసీపీకి ఎక్కువగా డ్యామేజ్ చేస్తోంది. మున్ముందు వైసీపీ మూల్యం చెల్లించుకోక తప్పదు అని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# ప్రకాశం వైసీపీకి దిక్కెవరు...

**ఒంగోలు :** వైసీపీకి గట్టి పట్టున్న జిల్లాగా ప్రకాశం జిల్లాకు పేరుంది. అలాంటి జిల్లాలో ఇపుడు ఫ్యాన్ రెక్కలు సరిగ్గా తిరగడం లేదని అంటున్నారు. జిల్లా మొత్తాన్ని నడిపే సమర్థ నాయకత్వం లేదని అంటున్నారు. గతంలో అయితే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంటి చేత్తో జిల్లా రాజకీయాలను చక్కబెట్టేవారు. ఆయన వైసీపీని వీడి జనసేనలో చేరిపోయారు. దాంతో వైసీపీకి నాయకత్వం కొరత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు ప్రకాశం జిల్లాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ ఇంచార్జిలను అందరినీ ఒకే త్రాటి మీదకు నడిపించే కో ఆర్డినేషన్ లేకుండా పోతోంది అన్న చర్చ సాగుతోంది. జిల్లాలో చూస్తే కూటమి పటిష్టంగా ఉంది. బాలినేని జనసేనలో చేరికతో ఆ పార్టీ కూడా బలం పుంజుకుంది అని అంటున్నారు. ఇటీవల కాలంలో బాలినేనికి పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దాంతో బాలినేని రాజకీయంగా దూకుడు పెంచుతున్నారు. అది వైసీపీకి ఇబ్బందికరంగా మారుతుందా అన్న చర్చ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని వైసీపీ ఇంచార్జిలు అంతా యాక్టివ్ మోడ్ లో లేరని విమర్శలు విన వస్తున్నాయి. సొంతంగా స్థానిక సమస్యల మీద పోరు సలపడం లేదు



అని అంటున్నారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆందోళన మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపిస్తున్నారు అని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాజ్యసభ సభ్యుడుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి ఎందుకో జిల్లా రాజకీయాల మీద అంతగా ఆసక్తిని చూపించడం లేదని అంటున్నారు. ఇక జిల్లా అధ్యక్షుడుగా జగన్ సన్నిహితుడైన బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఎక్కువగా తన సొంత నియోజకవర్గం దర్శి ప్రాంతాలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. మరో వైపు చూస్తే అధినేత జగన్ ప్రకాశం జిల్లా మీద ఫోకస్ పెట్టి దిశా నిర్దేశం చేయాల్సిందే అని అంటున్నారు. అక్కడ సరైన నాయకత్వాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కూడా అంటునారు. నియోజకవర్గాల స్థాయిలో బలమైన నేతలు ఉన్నారని అంటున్నారు. అలాగే పార్టీకి మంచి ఓటు బ్యాంక్ కూడా ఉంది. మరి వీటిని దృష్టిలో ఉంచుకుని పార్టీని బలోపేతం చేసే నేతల కోసమే సెర్చ్ చేయాల్సి ఉంది అని అంటున్నారు. లేకపోతే మాత్రం ప్రకాశంలో వైసీపీ వెలుగులు గత కాలం కాంతులు అన్న తీరుగానే ఉంటాయని కూడా అంటున్నారు. ముఖ్యంగా క్యాడర్ అయితే పూర్తిగా అసంతృప్తితో ఉందని కూడా గుర్తు చేస్తున్నారు.

## గ్రామ గ్రామాన యోగా మందిరాలు

-మొదటిపేజీ తరువాయి

యోగాంధ్ర లోగో ఉన్న చొక్కా ధరించి పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో ప్రముఖ యోగా గురు రామ్ దేవ్ బాబా వివిధ ఆసనాలు వేయించారు. ప్రాణాయామం, అనులోమ, విలోమ పద్దతుల్లో సీఎం చంద్రబాబు యోగాభ్యాసం చేశారు. అలాగే యోగాభ్యాసంలో భాగంగా వివిధ ఆసనాలను సీఎం చంద్రబాబు సునాయాసంగా వేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఐజీఎం స్టేడియం విద్యార్థి, యువతీ, యువకులతో నిండిపోయింది. వివిధ స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. యోగాసనాలు వేశారు. ఉదయం ఐదు గంటల నుంచి రామ్ దేవ్ బాబా ప్రజలతో యోగ సాధన చేయించారు. సమాజహితం కోసం బాధ్యతతో వ్యవహరిస్తామని ప్రజలతో సీఎం చంద్రబాబు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రశాంత వాతావరణంలో యోగా గురువు రామ్ దేవ్ బాబాతో కలిసి యోగాభ్యాసం చేయడం ఎన్నటికీ మరువలేం అన్నారు. "యోగాంధ్ర--2025లో విశాఖలో నిర్వహించి రికార్డులు సష్టించాం. ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ రికార్డులు, ప్రపంచ రికార్డులు సాధించాం. వచ్చే ఏడాది తిరుపతిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తాం. సంజీవని ప్రాజెక్టును ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తాం. వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేస్తాం... సంజీవనిలో యోగాను చేరుస్తాం. రోజుకో గంట యోగా, ధ్యానం, ప్రాణాయామం చేయాలి.. ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరమే రాదు. నేను 30 ఏళ్ల నుంచి యోగా అభ్యాసం చేస్తాను. ప్రతి రోజూ బిజీగా ఉంటాను.. రకరకాల సమస్యలను ఫేస్ చేయాల్సి వస్తుంది. కానీ యోగాసాధన చేయడం వల్ల అన్ని ఇబ్బందులను అధిగమించగలుగుతున్నాను. రాష్ట్రంలో మొత్తం 1.07 కోట్లమంది పౌరులు, 2.5 లక్షల మంది శిక్షకులు యోగాలో పాల్గొన్నందుకు రెండు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కాయి...వాటిని అధికారులు వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్నాయుడు, శ్రీనివాస వర్మ, యోగా--నేచురోపతి సలహాదారు మంతెన సత్యనారాయణరాజు, మంత్రి సత్యకుమార్ యాదవ్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, ఎస్. సవిత పాల్గొన్నారు.

## ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టులు

-మొదటిపేజీ తరువాయి

పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, విద్యుత్ రంగం, శాంతి భద్రతలు, మైనింగ్, ఎక్సైజ్ రంగాలపై ముఖ్యమంత్రి శ్వేత పత్రాలు విడుదల చేశారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన రాష్ట్రాన్ని రెండేళ్లలో వికాసం వైపు ఎలా తీసుకెళ్లింది... రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతలా పురోగతి సాధించింది... వంటి అంశాలను తాజా ప్రోగ్రెస్ రిపోర్టులో పొందుపరచాలని ముఖ్యమంత్రి చెప్పారు. రెండేళ్లలో చాలా శాఖల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాలు, గవర్నెన్స్‌లో తెచ్చిన సంస్కరణలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఎలా గాడిలో పెట్టామో చెప్పడంతో పాటు ఫేక్ న్యూస్‌కు చెక్ పెట్టడమే ప్రోగ్రెస్ రిపోర్టుల ఉద్దేశమన్నారు. నాటి 7 శ్వేత అంశాలతో సహా ఈసారి కొత్తగా డెవలప్మెంట్, గవర్నెన్స్, వెల్ఫేర్ అంశాలపైనా రిపోర్టులు విడుదల చేయాలని సీఎం స్పష్టం చేశారు. అగ్రికల్చర్, ఇండస్ట్రీస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, టూరిజం అంశాలతో 'డెవలప్మెంట్' ప్రోగ్రెస్ రిపోర్ట్... ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా తెచ్చిన పాలసీలు, అనుసరించిన విధానాలు, చేపట్టిన సంస్కరణలతో 'గుడ్ గవర్నెన్స్' ప్రోగెస్ రిపోర్ట్... సంక్షేమం, పీ4 వంటి వాటితో 'వెల్ఫేర్ -- ఎంపవర్మెంట్' ప్రోగ్రెస్ రిపోర్ట్ ఈసారి విడుదల చేయనున్నారు. వీటిలో ఫైనాన్స్, డెవలప్మెంట్, వెల్ఫేర్, గవర్నెన్స్... ఈ 4 అంశాలకు సంబంధించిన ప్రొగ్రెస్ రిపోర్టును ముఖ్యమంత్రి విడుదల చేస్తారు. 6 పేపర్లు మంత్రులు రిలీజ్ చేసిన తర్వాత... మిగిలిన 4 పేపర్లు ప్రజల ముందుంచాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. జూలై 18కల్లా మొత్తం అన్ని రిపోర్టులు విడుదల చేసేలా ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఇవన్నీ విడుదల చేసిన తర్వాత... అన్నీ కలిపి పుస్తక రూపంలో తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతీ ఏడాది ప్రోగ్రెస్ రిపోర్టులు తప్పనిసరిగా ఇవ్వాలని ఈ సందర్భంగా చెప్పారు. ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో ముందుగా సోమవారం విద్యుత్ రంగంపై ప్రోగ్రెస్ రిపోర్ట్ విడుదల చేయనున్నారు. మంత్రులు పయ్యావుల కేశవ్, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పలువురు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

## యోగా నాకు చాలా ఇచ్చింది:

-మొదటిపేజీ తరువాయి

తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. "నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, పరిపక్వతను ఇచ్చింది. నా ప్రయాణానికి సరైన మార్గాన్ని చూపింది. క్రియ యోగ, అష్టాంగ యోగ, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుదర్శన క్రియ వంటివి ఇప్పటికీ నా దినచర్యలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి" అని ఆయన వివరించారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలన్న మోదీ చొరవకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**విశాఖలో ఘనంగా యోగా వేడుకలు**

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వి. అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ జి.పి. రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు, సాధారణ పౌరులు, యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కడపలో కళకళలాడుతున్న స్టేడియం

**కడప :** కడప క్రికెట్ స్టేడియానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాత్రి సమయంలో తీసిన కడప స్టేడియం ఏరియల్ వ్యూ వీడియో కూడా ఆకట్టుకుంటోంది. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం దక్కడంతో.. కడప స్టేడియం గురించి అందరికీ తెలిసింది. ఇది దేశంలోనే అత్యంత అందమైన క్రికెట్ స్టేడియాల్లో ఒకటి అని చెబుతున్నారు. ఇంకా డెవలప్ చేసి, ఎక్కువ మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షించడానికి వీలుగా స్టేడియం కెపాసిటీని పెంచితే.. ఇక్కడ టెస్టులు, వన్డేలు నిర్వహించొచ్చని సూచిస్తున్నారు.'ఎప్పుడు ఈ రూట్లోనే వెళ్తుంటా.. కానీ ఈ స్టేడియం ఇంత బాగుంటుందని నాకు తెలీదు. ఏరియల్ వ్యూ చాలా బాగుంది' అని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఈ స్టేడియం పక్కనే రైల్వే ట్రాక్ ఉంటుందని.. రైల్లో వెళ్తున్నప్పుడు ఈ ప్రదేశాన్ని చూడటం భలే ఉంటుందని మరో నెటిజన్ తన అనుభవాన్ని చెప్పుకొచ్చారు. అంతా బాగానే ఉంది కానీ.. వేసవిలో ఏపీలో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో కడప ఒకటి. ఎండా కాలం ఇక్కడ 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయి, అదొక్కటే కొంచెం ఇబ్బంది అని ఓ నెటిజన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.క్రికెట్‌కు సంబంధించిన అప్డేట్స్‌ను ఎప్పటికప్పుడు ఎక్స్ ద్వారా అందించే జాన్స్ అనే వ్యక్తి ' ఆంధ్రా ప్రీమియర్ లీగ్ వేదిక - కడప' అనే క్యాప్షన్‌తో పోస్టు చేసిన ఫొటోకు కొద్ది గంటల్లోనే 10 వేలకుపైగా లైకులు వచ్చాయి.ఈ క్రికెట్ స్టేడియం కడప నగరానికి 10 కిలోమీటర్ల దూరంలోని పుట్లంపల్లె ఏరియాలో ఉంది. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఈ స్టేడియం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ స్టేడియం నిర్మాణానికి వైఎస్ ఫ్యామిలీ రూ. 50 లక్షలు విరాళం ఇచ్చిందని చెబుతారు. ఈ స్టేడియంను ఇటీవలే ఆధునికీకరించారు. కడప క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కలిసి ఆంధ్రా ప్రీమియర్ లీగ్ కోసం కావాల్సిన వసతులను సిద్ధం చేశాయి. అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ స్టేడియాన్ని జూన్ 17న ప్రారంభించారు.ప్రస్తుతం ఈ స్టేడియంలో 15 వేల మంది ప్రేక్షకులు కూర్చొని మ్యాచ్‌ను వీక్షించొచ్చు. ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు నిర్వహించేలా 85 గజాల బౌండరీ లైన్, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పిచ్‌లను రూపొందించారు. ఇక్కడ ఒక రెసిడెన్షియల్ క్రికెట్ అకాడమీ కూడా ఉంది.ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) విషయానికి వస్తే.. జూన్ 9న ప్రారంభమైన ఈ టోర్నీ ఈ నెలాఖరు వరకు జరగనుంది. మొదటి 11

# తప్పిపోయిన ఇద్దరు బాలికలను 24 గంటల్లో ఛేదించిన బేతంచెర్ల పోలీసులు

**బేతంచెర్ల పోలీసులను అభినందించిన డోన్ డిఎస్పి శ్రీనివాసులు**



**బేతంచెర్ల, జూన్ 21(ప్రజా జ్యోతి)** బేతంచెర్ల పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులకు పోలీసులు ఊరటనిచ్చారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టిన బేతంచెర్ల పోలీసులు, 24 గంటల్లోనే బాలికలను గుర్తించి సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు.పోలీసుల వివరాల ప్రకారం, బేతంచెర్ల టౌన్‌లోని రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న షేక్ అన్వర్ బాష, షేక్ ఆబెధాభి దంపతుల కుమార్తెలు షేక్ అర్షియా బేగం (12), షేక్ నదియా (15) ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం తమ నానమ్మ ఇంటికి వెళ్తున్నామని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. అయితే వారు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఉదయం బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ డి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై వి. రమేష్‌బాబు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పట్టణంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో బాలికలు బేతంచెర్ల నుంచి నంద్యాలకు వెళ్లే బస్సులో ఎక్కినట్లు గుర్తించారు. అనంతరం నంద్యాలలో గాలింపు చేపట్టిన పోలీసులు, ఎస్‌పీజీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఎగ్జిబిషన్ వద్ద బాలికలు కనిపించినట్లు సమాచారం సేకరించారు. అక్కడి సీసీ కెమెరాల ఆధారంగా వారు నంద్యాల రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు గుర్తించి, పలు రైల్వే స్టేషన్ల వద్ద పోలీసు బృందాలను అప్రమత్తం చేశారు. చివరకు డోన్ రైల్వే స్టేషన్‌లో ఇద్దరు బాలికలను గుర్తించి అదుపులోకి తీసుకుని బేతంచెర్లకు తరలించారు.అనంతరం బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాలికలను త్వరితగతిన గుర్తించి సురక్షితంగా తీసుకువచ్చిన సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్సై వి. రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది చక్రధర్, భాను ప్రకాష్, గురుబాబు, రాజు నాయక్, బాల హుస్సేన్, సూర్య, రామరాజు, గిరిలను డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

# ఆధార్ అనుసంధానం లేక రైతు భరోసాకు దూరం

**పాస్‌బుక్‌ల సమస్యలతో గిరిజన రైతుల గగ్గోలు**


**ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు అందడం లేదంటూ ఆవేదన**



**ఎటపాక, జూన్ 21 (ప్రజాజ్యోతి):**పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం లేకపోవడం, ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్ కాకపోవడం వల్ల గిరిజన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎటపాక మండలం కుసుమనపల్లి గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో వారు తమ సమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ సీడింగ్ లేకపోవడం, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం కాకపోవడం వల్ల రైతు భరోసా, పీఎం–కిసాన్, పంట రుణాలు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు, ఎరువుల సబ్సిడీలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదని వాపోయారు. భూమి రికార్డులు, ఆధార్ వివరాలు ఆన్‌లైన్‌లో సరిపోలకపోవడంతో ప్రభుత్వ పోర్టళ్లలో సాంకేతిక సమస్యలు తలెత్తి రైతులు నష్టపోతున్నారని తెలిపారు.గత నాలుగు దశాబ్దాలుగా తమ భూములపై హక్కులు కలిగి ఉండి పంట రుణాలు, ఎరువులు, సబ్సిడీలు పొందుతున్నామని, అయితే ఇటీవల సేవలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. గతంలో అందుతున్న సౌకర్యాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. పోలవరం జిల్లా ఏర్పాటైన తర్వాత భూ రికార్డుల మార్పులు, ఆన్‌లైన్ సాంకేతిక సమస్యల కారణంగా పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం నిలిచిపోయిందని రైతులు ఆరోపించారు. దీంతో అనేక మంది రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి దూరమవుతుండగా, వ్యవసాయ అవసరాల కోసం రుణాలు పొందడంలో కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పట్టా పాస్‌బుక్‌లకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో పూసం రాఘవయ్య, సున్నం బొజ్జి, పూసం నాగేశ్వరరావు, కోర్సా రాజయ్య, ఇరప్ప సత్తెమ్మ, తాటి శ్రీనివాస్, ఇరప్ప బాలరాజు, చందు, పూసం అన్నారావు, కుంజా పండు తదితర గిరిజన రైతులు పాల్గొన్నారు.

# చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక

- చేనేత ,ఖాదీ వస్త్రాల గుర్తింపును బలోపేతం చేయడమే లక్ష్యం చేనేత కార్మికుల సంక్షేమం , అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత
- రూ.12 కోట్లతో ఆధునిక సదుపాయాలతో చేనేత, ఖాదీ క్లస్టర్ ఏర్పాటు అధునాతన ఖాదీ చేనేత వస్త్రాల నేతల్లో 500 మహిళలకు ప్రత్యేక శిక్షణ
- చేనేత రంగాన్ని మరింత లాభదాయకంగా మారుస్తాం
- పొందూరు లో శ్రీ సాయిబాబా వీవర్స్ సొసైటీ నూతన భవనం ప్రారంభించిన రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్,ఎమ్మెల్యే కూన రవికుమార్





**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పొందూరు చేనేత ఖాదీ వస్త్రాలను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని , చేనేత రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక వంటిదని రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు.పొందూరు మండల కేంద్రంలో సాయిబాబా వీవర్స్ సొసైటీ ఆవరణంలో రూ. 50 లక్షల నిధులతో నిర్మించిన కామన్ ఫెసిలిటేట్ సెంటర్ ను స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల అభివృద్ధి , ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా పొందూరు లో 5 ఎకరాల విస్తీర్ణంలో రూ. 12 కోట్లతో చేనేత ,ఖాదీ క్లస్టర్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. దానికోసం 500 మంది మహిళలకు సెర్ప్ ఆధ్వర్యంలో ఆధునాతన చేనేత ఖాదీ వస్త్రాల నేతల్లో 60 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పొందడంతో పాటు కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. రాబోయే చేనేత ,ఖాదీ క్లస్టర్ లో నూలు ప్రోసెసింగ్ , వస్త్రాల తయారీ ,నాణ్యత పరిశీలన , నిల్వ మార్కెటింగ్ వంటి అన్ని సదుపాయాలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల పొందూరు చేనేత ఉత్పత్తులకు దేశీయ అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ఆదరణ లభిస్తుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి వారి వృత్తి అభివృద్ధి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. వీవర్ సొసైటీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా కార్మికులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. చేనేత రంగాన్ని లాభదాయకంగా మార్చి యువత మహిళలను ఈ రంగం వైపు ఆకర్షితులు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ,చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**రూ.40 లక్షలతో నిర్మితమైన రోడ్డు ప్రారంభం**

మండలం దల్లవలస పంచాయతీ ఎస్.జి. ఎన్ పేట కు ఆర్.ఎం.బి రోడ్డు నుండి రూ.40 లక్షల ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ను రవికుమార్ ప్రారంభించారు. ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను పెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామాల అభివృద్ధి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని , ఆ దిశగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , జిల్లా పార్టీ కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ,ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు,తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్,మండల తెలుగు యువత అధ్యక్షులు కంబాపు శ్రీనివాస్ రావు,ఎంపీటీసీలు బాడాన హారిక అనకాపల్లి వాణి కాలేపు శ్రీనివాస రావు ,ఉపాద్యాయులు మొగదాల రమణారావు రిటైర్డ్ ఉపాద్యాయులు కోరుకొండ విజయ్ కుమార్,ఆనం పాపారావు , దండా రవి,పి రామకృష్ణ పి లక్ష్మీ , హ్యాండ్లూమ్స్ ఏ .డి టి జనార్ధన రావు పర్సన్ ఇంచార్జి ఆర్ శేఖర్ సాయిబాబా వీవర్స్ సొసైటీ మేనేజర్ శ్రీనివాస్ రావు పి.ఆర్ డి.ఈ చంద్రశేఖర్ ఏ.ఈ దయాసాగర్ ఏపీయం గురుగుబెల్లి శ్యామల రావు, కూటమి నాయకులు కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ యోగా డే కార్యక్రమం



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) జూన్ 21::**పిఎం శ్రీ జెడ్ పిహెచ్ఎస్ ప్లస్ కామరాజుపేట, గోకవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా. పాఠశాలలో ఇంటర్నేషనల్ యోగా డే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈరోజు జరిగిన యోగా డే కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బహిరంగ మైదానంలో, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో, శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే అనేక యోగా ఆసనాలు ప్రాక్టీస్ చేశారు. విద్యార్థుల సమీకృత ప్రదర్శన, ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యతను చాటి చెప్పింది. యోగా కార్యక్రమం తర్వాత, అందరిలో సానుకూల భావనను పెంపొందించటం జరిగింది. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ ఇది మన శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని గుర్తు చేసే రోజు. యోగా ద్వారా మనం ఒత్తిడిని తగ్గించుకోవచ్చు, శరీరానికి నిలకడ, సంతులనం, మరియు సహన శక్తిని పెంపొందించుకోవచ్చు. అంతేకాదు, యోగా మనలో సానుకూల దృక్పథాన్ని, ప్రశాంతతను, మంచి జీవనశైలిని అలవర్చుకునే అవకాశం ఇస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ భూసమేత శ్రీ వెంకటరశ్వరస్వామివారి శిలా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



**కాట్రేనికోన ప్రజాజ్యోతి** డా బి ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం కాట్రేనికోన పరమేశ్వర థియేటర్ ఆవరణలో వెంచేసి ఉన్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి శిలా విగ్రహం మరియు గణపతి, ఆంజనేయ శిలా విగ్రహం, ఆలయ శిఖర, జీవ ధ్వజస్తంభం, గరుడ బలిపిఠ పునః ప్రతిష్ట మహోత్సవం పోస్టర్ ఆలయ కమిటీ విడుదల చేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ జూన్ 30వ తేదీ నుండి జూలై 2వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ కమిటీ తెలియజేసారు

## ఘనంగా ఈరన్న స్వామి ఆలయం నందు యోగ డే కార్యక్రమం





**కౌతాళం, జూన్ 21 ప్రజా జ్యోతి** శ్రీ లక్ష్మీ నరసింహ ఈరన్న స్వామి వార్ల దేవస్థానం, ఉరుకుంద నందు ఇంటర్ నేషనల్ యోగ డే జూన్ 21న రాష్ట్ర ప్రభుత్వము నిర్వహించ తలపెట్టిన్నందున డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి శ్రీమతి కె.వాణి ఆధ్వర్యంలో యోగాసనాలు, ప్రాణాయామము, మరియు ధ్యానము మొదలైన కార్య క్రమములను నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొనడమైనది..

## సర్ మ్యాపింగ్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ పాల్ దినకర్



**కౌతాళం, జూన్ 21 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో ఆదివారం రోజున నిర్వహిస్తున్న సర్ మ్యాపింగ్ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ పాల్ దినకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు మరియు నమోదవుతున్న వివరాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు సంఘం నిబంధనలు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. సర్ 2025 కార్యక్రమం విజయవంతంగా అములు కావాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి కచ్చితమైన వివరాలను సేకరిస్తారని తెలిపారు. ముఖ్యంగా సమాచారాన్ని జాగ్రత్తగా ధ్రువకరించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాటు లేకుండా పనులను పూర్తి చేసి ఓటర్ జాబితా సమగ్రతను కాపాడాలని సూచించారు. సర్ 2025 కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి మరణించిన,వేరే ప్రాంతాలకు మారిన మరియు డూప్లికేట్ ఓటర్లు వివరాలను కూడా పరిశీలిస్తారని తెలిపారు. అలాగే అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడంతో పాటు ఓటర్లు తమ వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలిస్తారని తెలిపారు.ఓటర్లు ఏన్యుమరేషన్ ఫారం ను తీసుకున్న తర్వాత తమ గుర్తింపు కార్డు పాస్పోర్ట్ సైజు ఫోటోను ఇచ్చి అవసరమైన సమాచారం సంబంధిత పత్రాలను బిఎల్వోలకు అందించి,ప్రజలు పూర్తి సహకారం అందించాలని సూచించారు.సర్ మ్యాపింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించి, సంబంధిత అధికారులకు అందజేస్తారని,ఇదే సర్ యొక్క ఉద్దేశమని పాల్ దినకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యోగా అనేది పురాతన భారతీయ జీవన విధానం...మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు

:-యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదు,శ్వాస నియంత్రణ,ఆసనాలు మరియు ధ్యానం కలయిక

:-సింగిల్ విండో చైర్మన్ వెంకటపతిరాజు, మండల అభివృద్ధి అధికారి,తహసిల్దార్ మరియు మండల విద్య అధికారి శోభారాణి

:-కౌతాళం నందు ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులు.



**కౌతాళం, జూన్ 21 ప్రజా జ్యోతి** రోజు కౌతాళం మండల కేంద్రం నందు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా నిర్వహించడం జరిగింది.రాష్ట్ర కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా దినోత్సవన్ని మా కూటమి నాయకులు,మండల అధికారుల తో మరియు విద్యార్థులతో కలిసి యోగాసనాలలో పాల్గొనడం జరిగినది.ఈ సందర్భంగా యోగా కేవలం ధ్యానం మాత్రమే కాదని మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం మరియు ఆరోగ్య నియంత్రణ మెరుగుపరుస్తుందని, దీనిని ప్రతి ఒక్కరు దినచర్యలో భాగంగా చేసుకుంటే ఒక మనిషి జీవిత కాల సగటు పెంచుకోవచ్చని, యోగాను ప్రపంచ దేశాలకు పరిచయం చేసింది మన భారతదేశమే అని తెలియజేశారు.ఈ కార్యక్రమములో సీనియర్ నాయకులు రామలింగ అన్న, డా"రాజనందు,గిరి,సుభాన్,రమేష్, లింగేశ్,ఈరన్న,కృష్ణ,అమ్మువలి,నభిసాబ్, తయన్న ,రేవన్న,భీమ,నాగరాజు మరియు కళాశాల,పాఠశాల,మండల అభివృద్ధి మరియు తహసీల్దార్ అధికారులు పాల్గొనడం జరిగినది

## అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బంది పడుతున్న కార్మికుడికి ఆర్థిక సహాయం అందించిన ఆ నలుగురు సేవా సమితి



**గుంతకల్లు జూన్ 21 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని అంజలి నగర్‌కు చెందిన తాయన్న భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నా రు. ఇటీవల తీవ్ర అనారోగ్యా నికి గురికావడంతో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. స్థానికుల సమాచారం మేరకు వారి వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం ఆ నలుగురు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షు లు వి. మంజుల వెంకటేష్ రూ:10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ నలుగురు సేవా సమితి సభ్యులు ఏపీ చక్రపాణి, లింగేశ్వర్ పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజే శారు."ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ."ఆ నలుగురు సేవా సమితి సేవే మా లక్ష్యమని తెలిపారు.

## మొహరం పండుగకు ముందస్తు అనుమతి తప్పనిసరి

**హాలహర్వి ఎస్ఐ ఈశ్వరావు**



**హాలహర్వి జూన్ 21ప్రజాజ్యోతి:-** హాలహర్వి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు మొహరం పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులు, తాజియా స్థాపనలు మరియు మతపరమైన కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని హాలహర్వి ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.ఆదివారం విలేకరులు సమావేశంలో ఎస్ఐ ఈశ్వరరావు మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, పండుగ సందర్భంగా ఎటువంటి గొడవలు, వివాదాలు, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పండుగను అందరూ పరస్పర సహనం, సౌభ్రాతృత్వం, సామరస్యంతో జరుపుకోవాలని కోరారు. పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు చేసినట్లయితే సంబంధిత వ్యక్తులపై, గొడవలు,రెచ్చగొట్టే వాక్యాలు సృష్టించే వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## ధర్మవరంలో సిద్దా కాశీని పలకరించిన మురళీ కృష్ణంరాజు



**కాకినాడ జిల్లా జూన్ 21(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణం రాజు శనివారం పర్యటించారు.ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న సిద్దా కాశీని ఆయన స్వయంగా కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో నాయకులు జువ్వల దొరబాబు,దాడి పుత్రయ్య,సిద్దా శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఒత్తిడి లేని జీవనశైలి యోగాతోనే సాధ్యం








: గుమ్మనూరు నారాయణ స్వామి

**గుంతకల్లు జూన్ 21 (ప్రజా జ్యోతి):** ఒత్తిడి లేని జీవనశైలి యోగాతోనే సాధ్యమని గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగ ఆంధ్ర కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్థానిక రైల్వే గ్రౌండ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి, గుంతకల్లు రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు, రైల్వే ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు హాజరై యోగాసనాలు చేసి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకు న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ వచ్చిడి లేని జీవనశైలి యోగతోనే సాధ్యమవుతుం దని, మన దైనందిన జీవితంలో యోగ ఒక భాగంగా మారితే ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యం సౌభాగ్యం సిద్ధించడంతోపాటు మానసిక వికాసం మన సొంతం అవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు చేపడు తున్న ఇలాంటి కార్యక్రమా లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**యువతపై ప్రత్యేక దృష్టి**

యువత శారీరక, మానసిక వికాసానికి యోగా ఎంతగానో తోడ్పడుతుందని, విద్యార్థు లు ఏకాగ్రతను పెంచుకోవడా నికి ఇది ఒక చక్కని మార్గమ ని, యోగాను కేవలం ఒక్క రోజుకే పరిమితం చేయకుం డా, నిత్య జీవితంలో ఒక భాగంగా మార్చుకుని సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లాలని ఎస్ కే పి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. లక్ష్మయ్య ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, మున్సిపల్ టిపిఆర్ఓ గుడిసి మోహన్, మున్సిపల్ సిబ్బంది, కూటమి నాయకులు మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్, మాజీ కౌన్సిలర్ వై సుధాకర్, కొలిమి రామాంజనేయులు, విద్యార్థి, విద్యార్థినీ లు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం ప్రపంచానికి అందించిన ఒక గొప్ప వరం యోగ

**ఆరోగ్యవంతమైన జీవనశైలికి యోగ పుట్టినిల్లు లాంటిది........**

**అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో వక్తలు.....**







**కూనవరం,జూన్21( ప్రజా జ్యోతి న్యూస్)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కూనవరం మండల స్థాయి మెగా యోగా కార్యక్రమం కోతులగుట్ట కేజీబీవీ( కేజీబీ వీ) పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించ బడింది.ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు, పీడీలు, పీటీలు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజలు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో కూనవరం యోగా యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, యోగా ద్వారా శారీరక, మానసిక మరియు సామాజిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరిగి, ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవడుతుందని వివరించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం,యోగా సాధన వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు.జిల్లా కలెక్టర్ పోలవరం ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని వివిధ వేదికల వద్ద సామూహిక యోగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని యోగా పట్ల తమ ఆసక్తిని చాటుకున్నారు."ఒక భూమి -- ఒక ఆరోగ్యం కోసం యోగా" అనే భావనతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, సామాజిక సామరస్యం సాధ్యమవుతాయని కార్యక్రమంలో పలువురు వక్తలు పేర్కొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసిన మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పీడీలు, పీటీలు, విద్యార్థులు, వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మహిళా సంఘాలు, యువత మరియు ప్రజలందరికీ మండల ప్రజా పరిషత్ కూనవరం తరఫున హృదయపూర్వక అభినందనలు మరియు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

# యోగాంధ్రతో ఆరోగ్య చైతన్యం.. నందిగామలో ఘనంగా యోగా దినోత్సవం

**యోగాసనాలు అభ్యసించిన టీడీపీ మహిళా నాయకురాలు పునుగుపాటి స్రవంతి**

**ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా అవసరమని పిలుపు**



**ఎటపాక, జూన్ 21 (ప్రజాజ్యోతి):**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎటపాక మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన "యోగాంధ్ర" కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకురాలు పునుగుపాటి స్రవంతి పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్తులు వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించి యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పీఈటీ అనిల్, సచివాలయ సిబ్బంది సుకన్య, భవాని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించింది.

## కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం..



**కంబదూరు జూన్ 21:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,**కంబదూరు మండల కేంద్రం నందు ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణ, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, ఆ పాఠశాల విద్యార్థులు పాల్గొని యోగాసనాలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాభ్యాసానికి కేటాయించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని, యోగా అలవాటు చేసుకోవడం వల్ల ఏకాగ్రత పెరిగి మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు,మారుతి కాన్వెంట్ సురేంద్ర, శివలింగప్ప, ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, అమర్నాథ్, ఆ పాఠశాల ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు, గ్రామ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విశ్వవేదికపై భారతావని కీర్తిపతాకం.. మన యోగా!

**ఎటపాకలోని 212వ బెటాలియన్ ప్రాంగణంలో మిన్నంటిన యోగా ఉత్సాహం**

**ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని పిలుపు**

**కూటమి ప్రభుత్వంలో యోగాకు విశేష ప్రాధాన్యం: బొల్లా పుల్లయ్య, వల్లభనేని చందు**



**ఎటపాక, జూన్ 21 (ప్రజాజ్యోతి):** యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి వల్లభనేని చందు అన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎటపాకలోని 212వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీషాదేవి సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 212వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ, మండల తహసీల్దార్ కె. శ్రీనివాసరావు , ఎంపీడీవో విజయ దత్ తో కలిసి సీఆర్పీఎఫ్ సిబ్బంది, మండల అధికారులు యోగా సాధనలు చేశారు. ఈ సందర్భంగా బొల్లా పుల్లయ్య, వల్లభనేని చందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యోగాకు విశేష ప్రాధాన్యం లభించిందన్నారు. గత ఏడాది విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనడం, ఆ కార్యక్రమం గిన్నిస్ రికార్డుల్లో చోటు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. ఈ ఏడాది విజయవాడలో ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ పాల్గొనడంతో యోగా ప్రాముఖ్యత మరింతగా ప్రజల్లోకి చేరిందన్నారు. శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఆత్మకు ఆనందాన్ని అందించే యోగాను ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

# కూనవరంలో సర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రారంభం

-- గ్రామస్తుల సహకారం కోరిన ఎచ్చు రవి



కూనవరం గ్రామపంచాయతీ పరిధిలో సర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోందని గ్రామ శాఖ అధ్యక్షుడు ఎచ్చు రవి తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి గ్రామపంచాయతీ బీఎల్ఓలు, సచివాలయ సిబ్బంది ఫారాలను పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ, వ్యాపార లేదా ఇతర కారణాలతో దూర ప్రాంతాల్లో నివసిస్తున్న కూనవరం గ్రామస్థులకు ఈ సమాచారాన్ని వారి బంధుమిత్రులు చేరవేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. న్యూ ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా డోర్-టు-డోర్ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ బూత్ ఇన్‌చార్జీలు, బీఎల్ఓలు, బూత్ లెవల్ ఏజెంట్లు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఓటరు వివరాల సక్రమ ధృవీకరణ కోసం గ్రామ ప్రజలు సచివాలయ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎచ్చు రవి కోరారు. ప్రజల భాగస్వామ్యంతో ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి సమక్షంలో వైకాపాకు గుడ్‌బై పలువురు తెలుగుదేశం పార్టీలోకి చేరికలు





**రామాపురం జూన్ 21 ప్రజా జ్యోతి** రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లె, చిట్లూరు గ్రామాలకు చెందిన వైకాపా కార్యకర్తలు ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడాశాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిసమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మండల నాయకులు పప్పిరెడ్డి వినోద్ కుమార్ రెడ్డిఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగుట్టపల్లెకు చెందిన అయోధ్యపురం సుకుమార్ రెడ్డి, చిట్లూరు గ్రామానికి చెందిన అర్జునుడుతో పాటు పలువురు వైకాపా నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తూ, పార్టీలో తగిన గుర్తింపు కల్పించి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్న శ్రీ కాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ,జనసేన పార్టీ రాష్ట అధికార ప్రతినిధి కీర్తన





**నందలూరు జూన్ 21 ప్రజా జ్యోతి** నందలూరుకు జనసేన నాయకులు కొట్టే శ్రీహరి అహ్వానం మేర వచ్చిన శ్రీ కాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ గారు,జనసేన పార్టీ అధికార ప్రతినిధి కీర్తన గార్లను ఎన్డీఏకూటమి నాయకులు భారీగా ఘన స్వాగతం పలికి శాలువలతొ సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాసేపు ఎన్డీఏ కూటమి నాయకులు,స్థానికులతో కొట్టే సాయి ప్రసాద్ గారు,కీర్తన గారు మచ్చటించారు. అనంతరం రాయలసీమలోని ప్రముఖ పుణ్య క్షేత్రం అయిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంకు విచ్చేసిన శ్రీ కాళహస్తి ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ గారిని,జనసేన పార్టీ రాష్ట అధికార ప్రతినిధి కీర్తన గారిని ఆలయ మర్యదలతో అర్చకులు స్వాగతం పలికారు,ఆలయ ఈవో దిలిప్ గారు దర్శన ఏర్పాట్లు చేశారుదర్శనం అనంతరం ఆలయ మర్యదల తో కొట్టే సాయి ప్రసాద్ గారిని,పరింగిశెట్టి కీర్తన గారిని సత్కరించి ఆలయ వేద పడింతులతో ఆశ్వీరచనం అందించారు. ఆనంతరం శ్రీ సౌమ్యనాథ స్వామి అన్నదాన సత్రంను సందర్శంచి అన్నదాన ట్రస్ట్ కు శ్రీ కాళహస్తి ఆలయ చైర్మన్ అన్నదాన ట్రస్ట్ కు విరళాం అందించారు. ఈ కార్యక్రమంలో భారి ఎత్తున ఎన్డీఏ కూటమి నాయకులు మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు,మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం,హైస్కూల్ చైర్మన్ ఉపేంద్ర, ఉప్పుశెట్టి సుధీర్,మాజీ సర్పంచ్లు జంబు సూర్యనారయణ, మోడపోతుల రాము, గంగధర్, జిగిలి ఓబులేస్,హిమగిరి,రెడ్డేయ్య, బాలజి, కొట్టే రాఘవ, హోటల్ శివ,పర్న రామయ్య, డాల, మొహన్, మస్తాన్ రాయల్,మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, అబ్బిగారి గోపాల్, రత్నం, పవన్ కుమార్, రాయచోటి చిరంజీవి యువత అధ్యక్షులు జయారం, అనంగి హరి చంద్ర,బాల,కొట్టే నాగేంద్ర, ప్రతాప్, సురేష్, వర్మ,శివ,సునిల్,సుధకర్,కొట్టే ప్రదీప్,కొట్టే హరి, తోట సుబ్బయ్య,బద్రి, స్థానికులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవము




**ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా,యువజన మరియు క్రీడ శాఖ మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**రాయచోటి జూన్ 21 ప్రజా జ్యోతి** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడుగా లయన్ ఎస్.రామాంజనేయ రెడ్డి,7వ సారి కార్యదర్శిగా లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్,కోశాధికారిగా లయన్ కె.శ్రీనివాసులు చేత ప్రమాణ స్వీకార మహోత్సవం కార్యక్రమము లయన్స్ కుటుంబ సభ్యుల మధ్య పండుగ వాతావరణంలా చేయించడం జరిగిందని అధ్యక్షుడు లయన్ పసుపులేటి శ్యామ్ తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు చేస్తున్న సేవలను అభినందిస్తున్నానని ప్రభుత్వం తరపున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని నూతన కార్యవర్గానికి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విశిష్ట అతిధులుగా పాల్గొన్న మాజీ గవర్నర్లు పి ఎం జె ఎఫ్ లయన్ చిన్నప్ప రెడ్డి, వియంజెఎఫ్ లయన్ సుధాకర్ రెడ్డి గార్లు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ డిస్టిక్ 316 జే లో ఉత్తమ స్థానంలో నిలిచిందని అలాగే నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కుటుంబ సభ్యులు ,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బద్వేల్ లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు






**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ జూన్ 21 (ప్రజాజ్యోతి)** బద్వేల్ పట్టణం నాలుగు రోడ్ల కూడలిలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆర్డిఓ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో చంద్రమోహన్ లు మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని, యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత మరియు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం యోగా గురువు అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు కలిసి వివిధ యోగాసనాలు చేశారు. ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం వంటి ఆసనాలతో కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపల్ కమిషనర్ బద్వేల్ రూరల్ అండ్ అర్బన్ సిఐలు పోలీస్ సిబ్బంది కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మానవవాదమే ప్రజాస్వామ్య పరిణతి

ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా మానవవాదులు, హేతువాదులు, నాస్తికులు, శాస్త్రీయ దృక్పథాన్ని విశ్వసించే ప్రజలు ప్రపంచ మానవవాద దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇది కేవలం ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు; మానవుడే విలువల కేంద్రం, మానవ సంక్షేమమే సామాజిక వ్యవస్థల అంతిమ లక్ష్యం అనే భావనను పునరుద్ఘాటించే సందర్భం.

ప్రపంచ మానవవాద దినోత్సవం సందర్భంగా ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. మానవవాదం అనేది కేవలం ఒక తాత్విక ధోరణి మాత్రమే కాదు; అది భారత రాజ్యాంగం ఆమోదించిన విలువ కూడా. ప్రపంచంలోని చాలా రాజ్యాంగాలు పౌరులకు హక్కులను కల్పిస్తాయి. కానీ భారత రాజ్యాంగం ఒక అడుగు ముందుకేసి పౌరులు ఎలాంటి విలువలను పెంపొందించుకోవాలో కూడా నిర్దేశించింది. అందులో మానవవాదానికి చోటు కల్పించడం దూరదృష్టికి నిదర్శనం. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది. మానవవాదాన్ని రాజ్యాంగం ప్రోత్సహిస్తున్నప్పుడు, మన విద్యా వ్యవస్థ, పరిపాలన, సామాజిక వ్యవస్థలు ఆ విలువను ఎంతవరకు ఆచరణలో పెడుతున్నాయి? నిజానికి భారత సమాజంలో ఇప్పటికీ కులం, మతం, జాతి, లింగం ఆధారంగా వివక్ష కొనసాగుతోంది. మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, సామాజిక అసమానతలు అనేక రూపాల్లో కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మానవవాదం కేవలం ఒక సిద్ధాంతం కాదు; అది సామాజిక అవసరం. మానవవాదం మనిషిని కులం కంటే గొప్పవాడిగా చూస్తుంది. మతం కంటే మానవ గౌరవాన్ని ప్రాధాన్యంగా పరిగణిస్తుంది. జన్మ కంటే వ్యక్తిత్వాన్ని, సంప్రదాయం కంటే హేతువును, విభజన కంటే సౌభ్రాతృత్వాన్ని విలువైనవిగా భావిస్తుంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా రాజ్యాంగం విజయవంతం కావాలంటే రాజ్యాంగ నైతికత సమాజంలో పెరగాలని చెప్పారు. రాజ్యాంగ నైతికతకు మూల సూత్రాలు-- స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం. ఇవే మానవవాదం ప్రధాన విలువలు కూడా. మానవ వాద భావజాలం పెరగాలంటే భారతదేశంలో ప్రమాదకరంగా ఉన్న కుల వ్యవస్థ నుంచి బయటపడాలి. దేశంలో ఇప్పటివరకు మతరహితులు, నాస్తికులు, మానవవాదులను తరచుగా 'ఇతరులు' అనే విభాగంలో కలిపేసేవారు. వారి సంఖ్య, అవసరాలు, వారి సామాజిక స్థితి గురించి స్పష్టమైన సమాచారం ప్రభుత్వాల వద్ద ఉండేది కాదు. మానవవాదం అనేది మానవ జీవితానికి అర్థం, విలువ, గౌరవం మానవుల నుంచే ఉద్భవిస్తాయని చెప్పే తాత్విక దృక్పథం. మానవీయ విలువల్ని పెంచడం, వాటిని అనుసరించడం కూడా మానవవాదమే. ఇది మత విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉండాల్సిన అవసరం లేదు; కానీ మానవ సమస్యలకు పరిష్కారాలను దైవిక జోక్యంలో కాకుండా మానవ బుద్ధి, శాస్త్ర విజ్ఞానం, నైతికత, సామాజిక బాధ్యతలలో వెతుకుతుంది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, మానవ హక్కులు, లింగ సమానత్వం, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్యం ఇవన్నీ మానవవాద ఆలోచనలో కీలక విలువలు.

భారతీయ సంప్రదాయంలో కూడా చార్వాకులు, లోకాయతులు, బౌద్ధులు, జైనులు వంటి అనేక ఆలోచనా ధోరణులు మానవవాదానికి దగ్గరగా ఉన్న భావాలను వ్యక్తపరిచాయి. ఆధునిక కాలంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, గోరా, ఎం.ఎన్.రాయ్ వంటి మహనీయులు మానవవాద, హేతువాద ఆలోచనలను సామాజిక ఉద్యమాలతో అనుసంధానించారు. దానికి కొనసాగింపుగా బి.రామకృష్ణ, గుత్తా రాధాకృష్ణ, డాక్టర్ పి.ఎం.భార్గవ, రావిపూడి వెంకటాద్రి, డాక్టర్ జయగోపాల్ లాంటి అనేక మంది సమాజం మార్పు కోసం అహర్నిశలు శ్రమించారు. భారత రాజ్యాంగం మత స్వేచ్ఛను హామీ ఇస్తున్నప్పటికీ, మతాన్ని అనుసరించకపోవడానికి సంబంధించిన గుర్తింపునకు ఇప్పటికీ సరైన పరిపాలనా వ్యవస్థ లేదు. ప్రభుత్వ పత్రాలు, విద్యాసంస్థలు, అనేక అధికారిక దరఖాస్తుల్లో మతం తప్పనిసరి కాలమ్‌గా కొనసాగుతున్న సందర్భాలు కనిపిస్తూనే ఉన్నాయి. నాస్తికుడు అంటే నైతికత లేని వ్యక్తి, మతరహితుడు అంటే సంప్రదాయ వ్యతిరేకి అనే అపోహలు ఇంకా సమాజంలో ఉన్నాయి.

# ధర్మారం లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

## జిల్లా రెండో ఉప గవర్నర్ లయన్ డాక్టర్ ఉదారీ చంద్రమోహన్ గౌడ్

**ధర్మారం :** ధర్మారం లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని ఈ క్లబ్ కు జిల్లాలో ఎంతో ప్రఖ్యాతి ఉందని లయన్స్ క్లబ్ 320జీ జిల్లా రెండో ఉప గవర్నర్ లయన్ డాక్టర్ ఉదారీ చంద్రమోహన్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం బొమ్మ రెడ్డి పల్లి లోని మహేశ్వర ఫంక్షన్ హాల్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ ధర్మారం అధ్యక్షుడు ఇప్ప మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. 2026 -2027 సంవత్సరానికి గాను జూలై 1 నుండి బాధ్యతలు స్వీకరించనున్న నూతన అధ్యక్షుడు చింతపండు నర్సింగం, కార్యదర్శి కట్ట రమేష్, కోశాధికారి కడారి కుమార్ తోపాటు కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఈ డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ ధర్మారంలో క్లబ్ ఏర్పాటు అయినప్పటి నుంచి ఇక్కడ సేవా కార్యక్రమాల్లో అగ్ర శ్రేణిలో నిలుస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఉమ్మడి కరీంనగర్ అదిలాబాద్ జిల్లాలోని క్లబ్ లకు పోటీగా నిలబడి ముందుకు సాగడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటివరకు ముగ్గురు రీజియన్ చైర్మన్ల తో పాటు ఆరుగురు జోన్ చైర్మన్లు ప్రాతినిధ్యం వహించడం క్లబ్ విశిష్టత గా ఆయన పేర్కొన్నారు . కొత్తగా ఏర్పాటైన క్లబ్ కార్యవర్గ సభ్యులు సేవా కార్యక్రమాలను చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ మోర బద్రేశం అందించిన జిల్లా పిన్ తో పాటు, సేవా కార్యక్రమాల ప్రగతి




పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఓల్లాల కృష్ణ హరి, జిల్లా క్యాబినెట్ అడిషనల్ ట్రెజరర్ కొల్లూరు జితేందర్, డిస్టిక్ మైక్రో క్యాబినెట్ మెంబర్, డిస్టిక్ పీఆర్వో తన్నీరు రాజేందర్, డిస్టిక్ మైక్రో క్యాబినెట్ మెంబర్, ఫార్మర్ సపోర్ట్ సామ ఎల్లారెడ్డి, జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్ సాదుల వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం చైర్మన్ లయన్ డాక్టర్ కామనీ శ్రీనివాస్, కో చైర్మన్ లయన్ పుచ్చకాయల మునీందర్ రెడ్డి, రీజియన్ చైర్మన్ లయన్ కావేటి రాజగోపాల్, జోన్ చైర్మన్ తలమక్కి రవీందర్ శెట్టి, క్లబ్ కార్యదర్శి కట్ట రమేష్, కోశాధికారి కడారి కుమార్, ప్రస్తుత కోశాధికారి మిట్టపల్లి చంద్రకాంతరెడ్డి, వైస్ ప్రెసిడెంట్, బోట్ల లక్ష్మీ నరసయ్య, క్లబ్ సభ్యులు లయన్ ఎండి ముజాహిద్, బండి రమేష్, ఆవుల మల్లేశం, ఈదుల శివకుమార్ రెడ్డి, అక్కినపల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగుపై ఎల్‌నినో!

**ఖమ్మం జిల్లాలో జాడలేని వర్షాలు**
**ఈ ఏడాది భారీగా తగ్గనున్న వరిసాగు**
**ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలంటున్న అధికారులు**
**ఆరుతడి, పూనాస పంటలే దిక్కంటున్న రైతులు**



వాతావరణ శాఖ చెప్పినట్లే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాలోని చాలా మండలాల్లో ఇప్పటివరకు వర్షాల జాడ లేదు. జూన్ చివరివారం వచ్చినప్పటికీ జిల్లాలో ఎక్కడా పెద్ద వానలు కురవలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే అసలు ఈ ఏడాది వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారనున్నది. ముఖ్యంగా వరిసాగుపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండనుంది. దీంతో రైతులు అటు వరి నారుమడులు సిద్ధం చేయాలా, లేక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలా.. అన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతు న్నారు. అయితే ఈ నెలాఖరు వరకు సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే స్వల్పకాలిక వరి వంగడాలను విత్తుకోవాలని, లేదంటే ప్రత్యామ్నయ పంటలనే ఎంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వానకాలం ప్రారంభమైందంటే చాలు ఖమ్మం జిల్లాలో రైతులు వరి నారుమడులు సిద్ధం చేయడంలో బిజీబిజీగా ఉంటారు. కానీ, ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. చిరుజల్లులు మినహా ఎక్కడా భారీ వర్షాలు నమోదు కాలేదు. భూమినే నమ్ముకొని కుటుంబాలను నెట్టుకొస్తున్న అన్నదాతలు వరుణదేవుడి రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఆకాశం వైపు చూస్తూ.. వానకాలం పంటల సాగుపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. వానకాలంలో 3.20 లక్షల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వరిసాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. ఎల్‌నినో కారణంగా ఈ వానకాలం సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షాలు నమోదవుతాయన్న వాతావరణ శాఖ అంచనాలు రైతుల్లో ఆందోళన పెంచుతోంది. ఈ నెలాఖరు వరకు సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే స్వల్పకాలిక వరి వంగడాలను విత్తుకోవాలని, లేదంటే వద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీంతో రైతులు వర్షాలు కురుస్తాయా లేక ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలా అన్న మీమాంసలో పడ్డారు.

**భారీ వర్షాల కోసం ఎదురుచూపు..**

గతేడాది వానకాలం సీజన్ కంటే ముందే మే చివరిలోనే జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి, దీంతో రైతులు మొదటివారంలోనే పెద్దఎత్తున విత్తనాలు వేశారు. కానీ, ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వానలు పడ్డాయి. పలు మండలాల్లో అసలు వర్షపాతమే నమోదు కాలేదు. రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, కూసుమంచి, పాలేరు, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మినహాయిస్తే మిగతా అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులే నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు సాగు విషయంలో ఆందోళనకు గురవుతున్నారు. జూన్ మొదటి రెండు వారాల్లోనే రైతులు పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేస్తారు. వర్షాలు కురిస్తే అవి మొలకెత్తుతాయనే ఆశతో ముందుకెళ్తారు. జూన్ చివరి వరకు కూడా పత్తి విత్తనాలు వేయడాన్ని సాధారణ సాగుగానే పరిగణిస్తారు. జూలై మొదటి వారంలో కొంత ఆలస్యంగా, ఆ తరువాత వారాన్ని పూర్తిగా ఆలస్యంగా పరిగణిస్తారు. ఆలస్యంగా సాగు చేయడం ద్వారా చీడపీడలు, ఎదుగుదల లోపం, కాత, పూత సరైన సమయంలో రాకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమై పంట నష్టాన్ని చవిచూసే పరిస్థితి ఉంటుంది. ఈ కారణంగా జూన్‌లోనే విత్తనాలు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతుంటారు.

**ప్రత్యామ్నాయ పంటల వైపు..**

వర్షాభావ పరిస్థితులు, యూరియా కొరత, ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో సమస్యల నేపథ్యంలో వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి పంటలు కాకుండా ఆరుతడి పంటలు వేసుకోవడం మేలు అని శాస్త్రవేత్తలు చెప్పడంతో రైతులు అటువైపుగా చూస్తున్నారు. 120 రోజుల కాలవ్యవధిలో చేతికొచ్చే పంట రకాలు ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకాలపై ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇది కూడా వేయలేకపోతే తక్కువ నీటి తడులతో పండే పంటలైన జొన్న, శనగ, పెసర, బొబ్బెర, కూరగాయల పంటలు సాగు చేయాలని బోర్లు, బావుల కింద ఉన్న రైతులు ఆలోచన చేస్తున్నారు.

# యూరియా యాప్‌ను రద్దు చేయాల్సిందే..

## రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి

**బాన్సువాడ :** యూరియా యాప్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, తక్షణమే యూరియా యాప్ ను ఎత్తివేసి పాత పద్ధతిలోనే రైతులకు యూరియాను సరఫరా చేయాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో మోస పూరితమైన హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక రైతులను విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతులకు సరిపడ యూరియా పుష్కలంగా లభించిదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లో పెట్టే పరిస్థితి దాపురించిందని అన్నారు. వ్యవసాయ సలహాదారుడిగా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్‌గా ఉన్న కాసుల బాల్ రాజ్ ప్రభుత్వానికి ఎం సలహాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. యాప్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా ఇక్కడి నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. రైతులకు రావాల్సిన మూడు విడతల రైతు బరోసా నిధులను ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి సర్కారు రైతులకు క్షమాపనలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులను రాజుగా చేయడమే లక్ష్యంగా గత సీఎం అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తే ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి రైతుల నడ్డి విరిచే పథకాలను అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో నిజాంసాగర్లో లో నీళ్లు లేక రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే కాళేశ్వరం నీటిని నిజాంసాగర్లోకి తీసుకొచ్చి నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగు నీరు అందించిన ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, యూరియా యాప్ ను ఎత్తేసి, పాత పద్దతిలోనే రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యానికి కొర్రీలు పెట్టకుండా అన్ని రకాల వరి పంటలకు బోనస్ ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నాయిని మొగులయ్య, బోడ రామచందర్, గులేపల్లి మొగులయ్య, మన్నే అనిల్, సాయిబాబా, లక్ష్మణ్, భరత్, షరీఫ్, ఎల్లయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు భరోసాగా ముఖ్యమంత్రి సహాయనిధి

- ఎమ్మెల్యే కూన రవికుమార్



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:** కష్ట సమయంలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరు పట్టణానికి చెందిన యు వెంకటరమణ కు ఆదివారం నాడు రూ.28,702 సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కును అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజా సంక్షేమం , ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్, జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, ఎంపీటీసీలు బాడాన హారిక ,అనకాపల్లి వాణి , పి లక్ష్మి , అనకాపల్లి చిన్న , ఏపియం గురుగుబెల్లి శ్యామల రావు, తదితరులు పాల్గొన్నారు.

## తాండూర్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




**తాండూర్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో తాండూర్ మండల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో, తాండూర్ పీహెచ్‌సీ ఆయష్ దవాఖానలో డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో సామూహిక యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వాటి ప్రయోజనాలు గురించి యోగా శిక్షకులు, పీఈటీ తొాగరి శ్రీనివాస్, ఉప్పుట్ల చందు అవగాహన కల్పించి కొన్ని ముఖ్యమైన ఆసనాలను కార్యక్రమానికి హాజరైన వారితో వేయించారు. యోగా సాదనతో అనేక శారీరక రుగ్మతలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. నిత్యం యోగా సాధనతో మన శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పని చేసి వ్యాదులను దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తాండూర్ మండల వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సాధకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వానలు కురవాలని హిమ్మత్‌నగర్‌లో కప్పతల్లి ఆడిన గ్రామస్తులు



**వీణవంక :** వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో ఆదివారం వానలు కురవాలని కోరుతూ సర్పంచ్ జడల శ్రీకాంత్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దలు అందరూ కలిసి కప్పతల్లి ఆట ఆడి, ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు బిందెలతో నీళ్లు ఎత్తుకొని గ్రామంలోని బొడ్రాయి, హనుమాన్, పోచమ్మతల్లి దేవాలయాల్లో విగ్రహాలకు నీళ్లు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగుకాలం దాటిపోతున్నా వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ గ్రామంలో కప్పతల్లి ఆడి, గ్రామంలోని దేవతలందరికీ ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాక శ్రీనివాస్, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ నల్ల తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు గెల్లు రమేష్, కర్ణకంటి భాస్కర్‌రెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, రఘువరన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో ఆకట్టుకున్న సామూహిక యోగాసనాలు



**కోల్ :** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ఆర్యవైశ్య భవన్ లో ఆదివారం నిర్వహించిన సామూహిక యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యాంత్రిక జీవనంలో ఆరోగ్యమే మహాభాగ్యమని సందేశాన్ని ప్రజల్లో స్ఫూర్తి కలిగించేలా వివిధ వర్గాల ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి యోగసానాలతో ఆకట్టుకున్నారు. ఆమె మాట్లాడుతూ యోగ అనేది వ్యాయామం మాత్రమే కాదనీ, మనిషి శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ తమ దైనందిన జీవితంలో 'యోగను దినచర్యగా అలవర్చుకోవాలన్నారు. యోగ గురువు సరోత్తమరెడ్డి మాట్లాడుతూ యోగ సాధన ద్వారా ఆరోగ్యంపై ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు భారతీయ సంస్కృతి గొప్పతనంను గుర్తు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు రజనీ, సుల్వ లక్ష్మీనారాయణ, ఊరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య, ఎల్తూరి సరిత, జక్కుల పద్మ, కోట తిరుమల, జక్కన రాజ్యలక్ష్మీ, కోడూరి రమేష్, జక్కన్న బాలు, ప్రవీణ్, లక్ష్మీనర్సయ్య, గంగరాజు, రాజయ్య, నరసింహారెడ్డి, కళ్యాణ్, వకుళాభరణం వేణు, జనగామ శివరాం అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నిత్యజీవితంలో యోగా భాగం కావాలి

## ఎం ఈ ఓ - 2 కబీర్ సాబ్ జెడ్పీ హైస్కూల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం







**హొళగుంద, జూన్ 21, ప్రజా జ్యోతి న్యూస్ –** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులతో పాటు గ్రామస్థులు,ప్రజా ప్రతినిధులు,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**ఉత్సాహంగా సాగిన యోగాసనాల ప్రదర్శన**

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, సిబ్బంది కలిసి పలు రకాల యోగాసనాలను ప్రదర్శించారు. ముఖ్యంగా: తాడాసనం, వృక్షాసనం, పాదహస్తాసనం వజ్రాసనం, శశాంకాసనం, భుజంగాసనం వంటి ఆసనాలతో పాటు వివిధ రకాల ప్రాణాయామాలను క్రమశిక్షణతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆసనాల వల్ల శరీరానికి, మనస్సుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను నిర్వాహకులు అందరికీ కూలంకషంగా వివరించారు.

**నిత్యజీవితంలో యోగా భాగం కావాలి**

పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. కబీర్ సాబ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ నిత్యజీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.ప్రస్తుత ఒత్తిడితో కూడిన జీవన విధానంలో శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతగానో దోహదపడుతుందనీ,విద్యార్థులు చిన్నతనం నుంచే యోగాను అలవర్చుకోవడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని అన్నారు.ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల వనరుల కేంద్రం సిబ్బంది, స్థానిక సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు.

# బీరం విద్యాసంస్థల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం






**కడప జూన్ 21 ప్రజా జ్యోతి** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల ఆవరణలో నేడు ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి యోగా దినోత్సవంలో ముఖ్య అతిథులుగా స్టేట్ మార్క్ ఫెడ్ డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్ రెడ్డి , గ్రూప్ -1 ఆఫీసర్ బీరం శ్రీకాంత్ రెడ్డి ,కడప బీజేపీ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి , ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ డాక్టర్ హిమబిందు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం యోగా ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివిధ యోగాసనాలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన సంపద అని పేర్కొన్నారు. యోగా సాధన వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి చదువుపై దృష్టి కేంద్రీకరించగలరని, మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అంతేకాకుండా శరీరాన్ని దృఢంగా, చురుకుగా ఉంచి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.బీరం విద్యాసంస్థల అధినేత, కడప జిల్లా బీజేపీ నాయకులు బీరం సుబ్బారెడ్డి, మరియు చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ, ఏకాగ్రత పెరిగే కొద్దీ ఎక్కువ జ్ఞానాన్ని ఆర్జించవచ్చు. జ్ఞాన సముపార్జనకు ఏకాగ్రతే ప్రధాన మార్గం. యోగా ద్వారా విద్యార్థులు ఏకాగ్రతను పెంపొందించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరుఅని అన్నారు. యోగాను క్రమం తప్పకుండా ఆచరించడం వల్ల సమయపాలన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం వంటి సత్ప్రవర్తనలు అలవడతాయని, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని సూచించారు.అనంతరం పీ.ఈ.టీ.ల ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా ప్రాధాన్యాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో బీరం విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపాల్ హేమచందర్, ఉపాధ్యాయులు, పీ.ఈ.టీ.లు, విద్యార్థులు పాల్గొన్నారు. వారందరూ యోగాసనాలు చేసి యోగా యొక్క విశిష్టతను చాటిచెప్పారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



6వేల వేతనంతో కుటుంబ పోషణ అసాధ్యం –ఆయాలు, స్వీపర్లు ఆవేదన ఏళ్ళ తరబడి పాఠశాలల్లో సేవలు అందిస్తున్న ఆయాలను పర్మినెంట్ చేయాలి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల సమావేశం ఆదివారం స్థానిక బి కొత్తకోట షాదీ మహల్లో సమావేశం జరిగింది ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్లు అత్యంత దారుణమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారని, వారి శ్రమను ప్రభుత్వం పూర్తిగా దోపిడీ చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తీవ్రంగా విమర్శించారు. ఉదయం హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు రాకముందే పాఠశాలలకు చేరుకుని గదులు, ఆవరణ, టాయిలెట్లను శుభ్రం చేయడం, విద్యార్థుల సంరక్షణ బాధ్యతలు నిర్వహించడం సాయంత్రం అందరూ వెళ్లిపోయిన తర్వాత ఇంటికి వెళ్లడం వరకు అనేక పనులు చేస్తున్నప్పటికీ వారికి కనీస గౌరవప్రదమైన వేతనం కూడా అందడం లేదన్నారు. పిల్లల సంరక్షణ, పారిశుద్ధ్య పనులు, టాయిలెట్ క్లీనింగ్, అన్ని పనులు చేస్తున్న ఆయాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు విద్యా వ్యవస్థను నిలబెడుతున్న ఈ కార్మిక మహిళల పట్ల ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికుల సంక్షేమం గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నాయని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయాలు, స్వీపర్లకు గౌరవప్రదమైన వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్, చెల్లింపు సెలవులు మరియు ఇతర కార్మిక హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీం భాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ ఉపాధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి, నర్సింహులు, ఏఐటీయూసీ మండల నాయకులు బాలకృష్ణ,ఆయాల సంఘం నాయకులు యశోదమ్మ,విమల,నేత్రావతి, లక్ష్మన్న,అసీనా తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ యోగాంధ్ర--2026” దినోత్సవాన్ని పురస్కరించుకున్న ఎమ్మెల్యే బీవీ



**ఎమ్మిగనూరు జూన్ 21(ప్రజాజ్యోతి ):**యోగాంధ్ర--2026, 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “యోగాంధ్ర--2026” కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు పద్మశ్రీ మాచాని సోమప్ప సర్కిల్లో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తూ, “ఫిట్ ఆంధ్ర -- పర్ఫెక్ట్ ఆంధ్ర” నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి విద్యార్థినీ, విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పట్టణ ప్రజలతో కలిసి యోగా సాధనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. “యోగా మన శరీరానికి శక్తిని, మనసుకు ప్రశాంతతను అందించే జీవన విధానం. ప్రపంచవ్యాప్తంగా జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవడం భారతదేశానికి గర్వకారణం.” ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్, మున్సిపల్ కమిషనర్ ఉ డి ఇ, పట్టణ సీఐ, కుర్ని కార్పొరేషన్ చైర్మన్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, బీజేపీ, జనసేన నాయకులు, అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## దేవరగట్టులో శ్రీ మాలమల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**హొళగుంద, జూన్ 21, ప్రజా జ్యోతి న్యూస్ –** రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు.ఆదివారం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాలమల్లేశ్వర స్వామి వారికి, అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, బిల్వార్చన, బండారు అర్చనలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. అలాగే అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజలను వైభవంగా నిర్వహించారు.ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు నుదుటన కుంకుమ, బండారు(పసుపు)లతో తిలకధారణ చేసి స్వామివారి ఆశీస్సులు అందజేశారు.అనంతరం దూరప్రాంతాల నుండి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని,తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

## వీఆర్వో తలారి మునెప్ప ఆకస్మిక మృతి



**గోనెగండ్ల జూన్ 21(ప్రజాజ్యోతి ):** మండల పరిధిలో ని అగ్రహారం గ్రామం లో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న తలారి మునెప్ప ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు అగ్రహారం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న తలారి మునెప్ప స్వగ్రామం అయిన ఎమ్మిగనూరు మండలం పార్లపల్లిలో తమ సొంత పొలంలో పనులు చేస్తూ ఒక్కసారిగా ఛాతి నొప్పితో మృతి చెందారు. మృతుడికి భార్య భాగ్యమ్మ, కుమారుడు నరసింహుడు, కూతుళ్లు ఉన్నారు.

## యోగ ఆరోగ్యానికి మంచిది,



**గోపాలకృష్ణ ప్రజా జ్యోతి, చెన్నూరు, జూన్ 21 ,** ప్రపంచ యోగ డే సందర్భంగా అలంకాన్ పల్లి సర్కిల్ సమీపంలో ఉన్న శ్రీ రామచంద్ర మిషన్ ఆశ్రమంలో ఆదివారం యోగ డే సందర్భంగా సభ్యులు యోగాను యోగాను ఆశ్రమంలో ఆచరించారు. యోగ ఈ కార్యక్రమంలో రామచంద్ర ధ్యాన మందిర మందిరంలో ఆసనంలో, యోగ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. హార్ట్ఫుల్నెస్ మెడిటేషన్ వాటి కార్యక్రమాలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ధ్యాన మందిరం సభ్యులు శ్రీ గోపాలకృష్ణ, ఉమాదేవి, విజయ, మల్లికార్జున, చిన్న నరసింహులు, చెన్నయ్య, వెంకటసుబ్బయ్య సభ్యులు పాల్గొన్నారు

# అంబేద్కర్ ఆశయాలే మనందరికీ స్ఫూర్తి

**ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి**

**హెబ్బటం గ్రామంలో వైభవంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ**



**హొళగుంద,జూన్ 21, ప్రజా జ్యోతి న్యూస్ –** భారతదేశ రాజ్యాంగ నిర్మాత, సామాజిక విప్లవకారుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం హెబ్బటం గ్రామంలో వైభవంగా పండుగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై, విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**“అంబేద్కర్ ఆశయాలే మనకు స్ఫూర్తిలి**

ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడుతూ, “అంబేద్కర్ కేవలం ఒక వర్గానికో, ప్రాంతానికో పరిమితం కాదని, ఆయన భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు వెన్నెముక వంటివారని” కొనియాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రాముఖ్యతను ఆమె గుర్తు చేశారు. అంబేద్కర్ చూపిన బాటలో నడుస్తూ, సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రాజా పంపన్న గౌడ్, శేషగిరి, విష్ణువర్ధన్ రెడ్డి, అబ్దుల్ సుబాన్, మురళి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఎంఆర్పీఎస్ నాయకులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆకట్టుకున్న యోగ విన్యాసాలు

**రాయచోటి జూన్ 21 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 14వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కళాశాల ఓపెన్ ఆడిటోరియం ప్రాంగణంలో నిర్వహించిన యోగ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ భారత ఉపనిషత్తులు, వేదాలు మరియు ఆయుర్వేద వైద్యశాస్త్రంలో యోగా విశిష్టతను వివరించాయని తెలిపారు. యోగా భారతీయ సంస్కృతికి ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగ సాధనను అలవాటు చేసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, రక్తప్రసరణ సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులను తగ్గించుకోవచ్చని ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఈ యోగ విన్యాసాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను జీవితశైలిలో భాగంగా చేసుకుని ప్రతిరోజూ కొంత సమయం యోగ సాధనకు కేటాయించాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడిని జయించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని



కాపాడుకోవచ్చని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక అనివార్య సాధనమని ఆయన అభిప్రాయపడ్డారు. సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ. నరేష్, మేనేజ్‌మెంట్ ఌ ప్లేస్‌మెంట్స్ విభాగాధిపతి డాక్టర్ కె. ఇంతియాజ్ ఏ అండ్ డి ఎస్ విభాగాధిపతి పి. సుబహాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి. ప్రతాప్ రావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. శ్రావణ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి. సౌజన్య, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. కరుణాకర్, బేసిక్ సైన్సెస్ ఌ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్రతో పాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

## పిడుగుపాటుకు దూకి పశువు మృతి.



**అనంతగిరి మండలం. జూన్ 21. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం గరుగుబిల్లి పంచాయితీ. గరుగుబిల్లి గ్రామానికి చెందిన ఈటగడ్డ సింహాచలం అనే రైతు కు సంబంధించిన దూకి పశువు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పిడుగు గుపాటుకు గురై దుక్కి పశువు అక్కడికక్కడే మృతి చెందింది. 50.వేల రూపాయలు విలువచేసే పశువు మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరయ్యారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కోసం యోగా అవసరం

**: కమిషనర్ హరి ప్రసాద్**

**బేతంచెర్లలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు**



**బేతంచెర్ల, జూన్ 21(ప్రజా జ్యోతి)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బేతంచెర్ల పట్టణంలోని ప్రజావేదికలో శనివారం ఘనంగా యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్, ఎంపీడీవో ఫజుల్ రహిమాన్, యోగా ఉపాసకులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందించే గొప్ప సాధనమని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ కనీసం గంట సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. యోగా ద్వారా అనేక వ్యాధులను నివారించుకోవచ్చని, సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా యోగా పట్ల అవగాహన పెరగడానికి ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. విద్యార్థులు సైతం యోగా పట్ల ఆసక్తి చూపడం సంతోషకరమని, పట్టణంలో అందరికీ యోగా సాధనకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం యోగా గురువులు మద్దిలేటి స్వామి, వెటర్నరీ ఏడి రామసుబ్బారెడ్డిని కమిషనర్ హరి ప్రసాద్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సుమేధ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, కూటమి నాయకులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యోగతో ఆరోగ్యం యోగతో ఆనందం

### అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జమాల్ ఖాన్


**చింతూరు,జూన్ 21 ప్రజాజ్యోతి** యోగాతో ఆనందం ఆరోగ్యం లభిస్తుందని చింతూరు మండల తెలుగుదేశం అధ్యక్షులు ఎండి జమాల్ ఖాన్ పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం, ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీషాదేవి సూచనల మేరకు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చింతూరు లోని ట్రైబల్ గర్ల్స్ హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు ఎంపీడీవో శ్రీనివాస్ దొర ,విద్యార్థులు, జమాల్ ఖాన్ యోగా సాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని, శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనగా, లక్షలాది మంది యోగా సాధన చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డు నమోదైందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది విజయవాడలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమంలో



ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ పాల్గొని యోగా ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవన విధానంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా అత్యంత అవసరమైందని, శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఆత్మకు ఆనందాన్ని ప్రసాదించే యోగాను ప్రతి కుటుంబం తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని జమాల్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పసుపులేటి సల్మాన్ రాజు, టీడీపీ సీనియర్ నాయకులు పొదిలి రామారావు పాల్గొన్నారు.

## యోగా మన సంస్కృతిలో భాగమైన గొప్ప సంపద

### యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం యోగా మన జీవితంలో భాగం కావాలి





**హాలహర్వి జూన్ 21ప్రజాజ్యోతి :-** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హాలహర్వి మండల పరిధిలోని బాపురం గ్రామంలో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఉత్సాహంగా యోగ ఆసనాల కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామ సచివాల సిబ్బంది అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పచ్చారపల్లి భగత్ సింగ్ యూత్,బాపురం నేతాజీ యూత్ విద్యార్థినీ విద్యార్థులు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా శరీరం దృఢంగా, మనస్సు ప్రశాంతంగా, ఆలోచనలు సానుకూలంగా మారుతాయని చెప్పారు. ఆరోగ్యంగా ఉందాం ఆరోగ్య భారతాన్ని నిర్మిద్దాం అనే లక్ష్యంతో యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలు యోగాను ఆచరించాలని పిలుపునిచ్చారు. యోగా అనేది ఆరోగ్యవంతమైన జీవనానికి పునాది అని అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేసుకోవడం ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయని పేర్కొన్నారు. యోగా మన సంస్కృతిలో భాగమైన గొప్ప సంపద అని, దానిని ప్రతి కుటుంబం ఆచరించాలని సూచించారు.

## ప్రతి ఒక్కరిలో మానవ విలువలు పెంపొందాలి

**మండల అధ్యక్షులు లేవాకు వెంకటసుబ్బారెడ్డి**

చెన్నూరు.. సమాజంలో ప్రతి ఒక్కరిలో మానవ విలువలు పెంపొందాలని అప్పుడే మనిషికి మనిషి సాయం చేసే గుణం ఏర్పడుతుందని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షులు లేవాకు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ప్రచార కమిటీ సభ్యులు జీ ఎన్ భాస్కర్ రెడ్డి, చీర్ల సురేష్ యాదవ్, భాగ్యమ్మలు పేర్కొన్నారు. ఆదివారం నెలవారి సమావేశంలో భాగంగా మండల పరిధిలోని దౌలతాపురంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానవ తా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మరియు కొండకు దగ్గరగా ఉన్న ఏరియాలలో నివసిస్తున్న వారికి వాహన సౌకర్యాలు తక్కువగా ఉంటాయని అటువంటి ఆపద సమయంలో సమాచారం అందిస్తే సేవలు అందించేందుకు మానవతా



కుటుంబ సభ్యులు సిద్ధంగా ఉంటారన్నారు. ప్రతి గ్రామంలో నెలవారి సమావేశాన్ని ఏర్పాటు చేసి సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశాలను, చేసే సేవలను తెలిపారు. ఎస్టీ రామాపురంలో కూడా సమావేశాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని అక్కడి సభ్యులు తెలియజేశారని, అందుకు మానవతా కుటుంబ సభ్యులు కూడా సిద్ధంగా ఉన్నారని తొందరలోనే సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా అవగాహన కల్పిస్తామని తెలిపారు.



మండల వ్యాప్తంగా సంస్థ ఎన్నో సేవలను చేస్తున్నామని ఆ సేవలలో ప్రతి ఒక్కరు పాలుపంచుకుని సేవ చేసేందుకు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీలం శ్రీనివాసులు రెడ్డి, ఆర్ చిన్న కుందారెడ్డి, ట్రెజరర్ నారాయణరెడ్డి, పాత కుంట విజయభాస్కర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, వెంకటరమణ, కరుణాకర్, నాగ సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, వంశీధర్ రెడ్డి, రాజారెడ్డి మరియు మానవతా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్య సౌభాగ్యం..

యోగాసనాలు వేస్తున్న అధికారులు....




**చాగలమర్రి , జూన్21( ప్రజాజ్యోతి న్యూస్) ;** మన దైనందిన జీవితంలో యోగా ఒక భాగంగా మారితే ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య సౌభాగ్యం సిద్ధించడంతో పాటు మానసిక వికాసం మన సొంతం అవుతుందని తహసీల్దారు పణీంద్రుడు,ఎంపీడీఓ తాహీర్‌హుసేన్ లు పేర్కొన్నారు. చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు సుబ్బారావు,సురేంద్రనాథ్‌లు యోగాసనాలు వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక సమస్యలకు,శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగా ఆసనాలు వేయడం ద్వారా.. సంపూర్ణ ఆరోగ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతాయన్నారు. దైనందిన జీవితంలో పలురకాల ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలనుఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా, ధ్యానం కోసం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జిఎస్‌డబ్ల్యూ డిప్యూటీ ఎంపీడీఓ తారకేశ్వరి,ఎంసీఓ రాజ్‌కుమార్,పార్లమెంట్ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు , వివిధ శాఖల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది,పంచాయతీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## పని సున్నా,బిల్లు ఫుల్



**కుక్కునూరు,ప్రజా జ్యోతి,జూన్ 21:** తొండిపాక పంచాయితీలో ఉపాధి హామీ దోపిడి బట్టబయలు అయింది. చెరువుల అభివృద్ధి పేరుతో దొంగ మస్టర్లు వేసుకొని ప్రభుత్వానికి కుచ్చుటోపీ పెట్టారు. కట్ట మీద తట్ట మట్టి కూడా పోయకుండానే కొలతలు,బిల్లులు పూర్తి చెసి రికార్డులు సృష్టించారు. ఉపాధి హామీ పథకంలో జరిగే మోసాలకు కుక్కునూరు మండలంలోని రామిరెడ్డి చెరువు,కేసరి బాబురావు చెరువు క్లాసిక్ ఎగ్జాంపుల్‌గా నిలిచాయి. ఇక్కడ జరిగిన దోపిడీ చూస్తే యంత్రాంగం మొత్తం ఎలా కుమ్మక్కయిందో అర్థమవుతుంది. స్కామ్ ఫార్ములా బయటపడింది. పనిజరగలేదు. చెరువులో ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదు. క్షేత్రస్థాయిలో పని జరిగిన ఆనవాళ్లు లేవు. అయితే కూలీల పేరుతో మస్టర్లు మాత్రం వేశారు. మస్టర్ ప్రకారం డబ్బులు కూలీల బ్యాంక్ అకౌంట్లకు వెళ్లాయి. అంటే కూలీలను బలి పశువులుగా వాడుకున్నారు. పని చేయకుండానే కొలతలు వేయటం ఇక్కడే అసలు మోసం జరిగింది. రూల్స్ ప్రకారం కూలీలు ఎంత పని చేశారో టెక్నికల్ అసిస్టెంట్ క్షేత్రస్థాయిలో కొలతలు తీసి,మేజర్ మెంట్ బుక్ లో రాయాలి. ఆ కొలతల ప్రకారమే బిల్లు జనరేట్ అవ్వాలి. కానీ ఇక్కడ పని జరగకుండానే,కొలతలు లేకుండానే టి.ఏ.పాస్ చేశారు. ఇదంతా మొత్తం గ్యాంగ్ వర్క్ లా జరిగిందని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మొత్తం సెటప్‌లో అందరి హస్తాలు ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఫలితం చెరువుకు శాంక్షన్ అయిన నిధులు మొత్తం స్వాహా అయ్యాయి. జిల్లా కలెక్టర్,విజిలెన్స్ అధికారులు వెంటనే స్పందించి తొండిపాక ఉపాధి చెరువు పనులపై సుమోటో విచారణ చేయాలని,ఈకుంభకోణంలో పాత్ర ఉన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి,కొల్లగొట్టిన ప్రతి రూపాయి వారి నుండే రికవరీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మృతదేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించిన వై.ప్రదీప్ రెడ్డి



**కౌతాళం, జూన్ 21 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలో వైసిపి యువ నాయకులు భీమేష్ తల్లి సత్యమ్మ ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రాంపురం రెడ్డి సోదరులు కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చిన యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి అయనతో పాటు కౌతాళం మాజీ సర్పంచ్‌లు అవతారం, పాల్ దినకర్,మరియు నాయకులు కార్యకర్తలు కూడా ఉన్నారు.

## బిజినెస్

### రక్షణ రంగంలోకి సింహ 4x4



భారత్ ఫోర్జ్ లిమిటెడ్‌కు చెందిన రక్షణ రంగ అనుబంధ సంస్థ 'కల్యాణి (స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్' (కేఎస్ఎస్ఎల్), అంతర్జాతీయ రక్షణ సంస్థ 'పారామౌంట్'తో కలిసి సరికొత్త నెక్ట్స్ -- జనరేషన్ లైట్ ఆర్మర్డ్ మల్టీ--పర్పస్ వాహనం 'సింహ 4ఇ4' ను మార్కెట్లోకి తెచ్చాయి. నాటో ప్రమాణాలకు అనుగుణంగా సాయుధ దళాల ఆధునిక అవసరాలతో పాటు, అంతర్జాతీయ రక్షణ డిమాండ్లను తీర్చేలా ఈ వాహనాన్ని సరికొత్త డిజైన్‌తో రూపొందించారు. పట్టణ ప్రాంతాల్లో రక్షణ ఆపరేషన్లు, రోడ్లపై, కఠిన భూభాగాల్లో నిఘా పెట్టడానికి ఈ 'సింహ 4ఇ4' అనుకూలంగా ఉంటుంది. దీనిలోని మోడ్యులర్ ఆర్కిటెక్చర్ కారణంగా అవసరానికి తగ్గట్టుగా మార్పులు, చేర్పులు (అప్‌గ్రేడ్లు) చేసుకోవడం సులువవుతుంది.

### ఫోన్ పే వాడేవారికి బిగ్ అలర్ట్..
### ఆ ఛార్జీలపై కంపెనీ కీలక ప్రకటన

యూపీఐ పేమెంట్స్ అనగానే అందరికీ టక్కున గుర్తొచ్చే యాప్స్‌లో ఫోన్‌పే ఒకటి. అయితే ఇటీవల ఫోన్‌పే తన వాలెట్ ఇన్‌యాక్టివిటీపై విధిస్తున్న ఛార్జీల గురించి కొంతమంది కస్టమర్లకు నోటిఫికేషన్లు పంపింది. దాంతో "మా ఫోన్‌పే అకౌంట్ నుండి లేదా లింక్ అయి ఉన్న బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు కట్ అయిపోతాయా?" అని యూజర్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ గందరగోళంపై ఫోన్‌పే స్పందిస్తూ కీలక స్పష్టతనిచ్చింది. చాలామంది వినియోగదారులు ఫోన్‌పే అకౌంట్, యూపీఐ అకౌంట్, ఫోన్‌పే వాలెట్.. ఈ మూడింటినీ ఒకటే అనుకుని పొరబడుతుంటారని కంపెనీ తెలిపింది. కానీ ఇవి మూడూ వేర్వేరు సేవలు.

ఫోన్‌పే వాలెట్ : ఇది ఒక ప్రిపేయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్. అంటే ఇందులో మనం ముందుగానే డబ్బులు లోడ్ చేసుకుని వాడుకోవాల్సి ఉంటుంది.

యూపీఐ: యూపీఐ అనేది నేరుగా మీ బ్యాంక్ ఖాతా నుండి డబ్బులను డెబిట్ చేస్తుంది.

కంపెనీ క్లారిటీ: ప్రస్తుతం ప్రకటించిన ఇన్‌యాక్టివిటీ ఛార్జీలు కేవలం ఫోన్‌పే వాలెట్‌కు మాత్రమే వర్తిస్తాయి. దీనివల్ల మీ యూపీఐ లావాదేవీలకు గానీ, బ్యాంక్ ఖాతాకు గానీ ఎలాంటి నష్టం లేదు.

మీ బ్యాంక్ అకౌంట్ నుండి రూపాయి కూడా కట్ అవ్వదు..

ఒకవేళ మీ ఫోన్‌పే వాలెట్‌లో బ్యాలెన్స్ సున్నా ఉండి, మీరు దాన్ని చాలా కాలంగా వాడకపోతే.. మీ బ్యాంక్ అకౌంట్ నుండి లేదా యూపీఐ ద్వారా కంపెనీ ఎలాంటి ఛార్జీలను వసూలు చేయదు. ఈ ఛార్జీల విధింపు అనేది కేవలం వాలెట్‌లో ఉన్న అమౌంట్‌కు మాత్రమే పరిమితం అవుతుంది. మీరు ప్రతిరోజూ యూపీఐ వాడుతున్నా.. వాలెట్ వాడకపోతే మాత్రం వాలెట్ ఇన్‌యాక్టివ్‌గానే పరిగణించబడుతుంది.

ఏదైనా వాలెట్ నుండి ఇన్‌యాక్టివిటీ ఛార్జీలను మినహాయించే ముందు ఫోన్‌పే సదరు కస్టమర్‌కు 15 రోజుల ముందే సమాచారం పంపుతుంది. ఆ లోపు కస్టమర్ అలర్ట్ అయి క్రింది చర్యలు తీసుకోవచ్చు.

# అమెరికా వీసా నిబంధనల్లో మార్పు..
# కొత్త విధానం ఇలా!

అమెరికా ప్రభుత్వం అంతర్జాతీయ విద్యార్థుల వీసా నిబంధనల్లో ఒక పెద్ద మార్పును తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మార్పు అమల్లోకి వస్తే.. యూఎస్‌లో చదువుతున్న విదేశీ విద్యార్థుల జీవితంపై, ముఖ్యంగా భారతీయ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం అమెరికాలో ఖీ-1 వీసాతో చదువుతున్న విద్యార్థులు 'డ్యురేషన్ ఆఫ్ స్టేటస్' అనే విధానంలో ఉంటారు. ఈ విధానం ప్రకారం.. విద్యార్థులు తమ కోర్సు పూర్తయ్యే వరకు అమెరికాలో ఉండవచ్చు. అంటే చదువు కొనసాగుతున్నంత కాలం వారు వీసా పొడిగింపు కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. కోర్సు మార్చుకోవడం, యూనివర్సిటీ మారడం లేదా ఉన్నత చదువులకు వెళ్లడం కూడా సులభంగా జరుగుతుంది.

కానీ.. కొత్త ప్రతిపాదన ప్రకారం, ఈ సౌలభ్యం తగ్గే అవకాశం ఉంది. అమెరికా ప్రభుత్వం విద్యార్థులకు ముందుగా నిర్ణయించిన గడువుతో మాత్రమే ప్రవేశ అనుమతి ఇవ్వాలని భావిస్తోంది. సాధారణంగా ఇది నాలుగు సంవత్సరాల వరకు ఉండవచ్చని చెబుతున్నారు. ఆ గడువు పూర్తయిన తర్వాత అమెరికాలో కొనసాగాలంటే విద్యార్థులు తప్పనిసరిగా ఖూజ×ూ ద్వారా పొడిగింపు కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అమెరికా ప్రభుత్వం ఈ మార్పును తీసుకురావడానికి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం కారణం అని చెబుతోంది. ఎందుకంటే.. ప్రస్తుతం ఉన్న విధానంలో కొంతమంది విద్యార్థులు వీసా గడువు దాటినా దేశంలోనే కొనసాగుతున్నారని, వారిని ట్రాక్ చేయడం కష్టమవుతోందని అధికారులు భావిస్తున్నారు. అందుకే మరింత కఠినమైన, స్పష్టమైన నియంత్రణ వ్యవస్థ అవసరమని ప్రభుత్వం




అంటోంది. అయితే ఈ నిర్ణయంపై.. విద్యా రంగం, ఇమ్మిగ్రేషన్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం వల్ల విద్యార్థులు తరచూ పొడిగింపుల కోసం దరఖాస్తు చేయాల్సి వస్తుంది. దీనివల్ల పేపర్‌వర్క్ పెరగడం, ఆలస్యం జరగడం, చదువులో అంతరాయం కలగడం వంటి సమస్యలు ఎదురవుతాయని వారు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా భారతీయ విద్యార్థులపై ఈ మార్పు ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే భారతదేశం నుంచి అమెరికాకు ఎక్కువమంది చదువుకోవడానికి వెళు న్నారు. కొందరు భారతీయ విద్యార్థులు పీహెచ్‌డీ, రీసెర్చ్ కోర్సులు ఇక్కడే చేస్తారు. దీనికోసం ఐదు నుంచి ఏడేళ్లు అక్కడే ఉండాల్సి వస్తుంది. వీరంతా కొత్త నిబంధనల ప్రకారం.. మధ్యలో తప్పనిసరిగా పొడిగింపులు తీసుకోవాల్సి వస్తుంది. అదనంగా.. చదువు పూర్తైన తర్వాత ప్రస్తుతం ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను 30 రోజులకు తగ్గించే ప్రతిపాదన కూడా ఉంది. ఇది అమల్లోకి వస్తే.. అమెరికాలో చదువు పూర్తయిన వారు ఉద్యోగాలు వెతకడానికి సమయం సరిపోదు. దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# వాహనాలకు ఎల్‌నినో దెబ్బ
## సింగిల్ డిజిట్‌కు పరిమితం కానున్న ద్విచక్ర వాహనాలు: ఇక్రా

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు అన్ని రంగాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రుతుపవనాలు వచ్చినట్టే వచ్చి వెళ్లిపోవడంతో ఇప్పటి వరకు దేశీయంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియలేదు. ఈ దెబ్బకు దేశీయ ఆటోమొబైల్ రంగంపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలున్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. ప్రధానంగా కార్ల విక్రయాలతోపాటు ద్విచక్ర వాహన అమ్మకాలు సింగిల్ డిజిట్‌కు పరిమితం కానున్నదని వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ద్విచక్ర వాహన విక్రయాలు 3 శాతం నుంచి 5 శాతం వరకు మాత్రమే వృద్ధి నమోదుకావచ్చునని అంచనావేస్తున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా



చమురు ధరలు భగ్గుమనడం, మరోవైపు వాహన ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచడం కూడా విక్రయాల వేగానికి కళ్లెం వేయనున్నాయని పేర్కొన్నది. మరోవైపు, ఈ ఏడాది కమోడిటీ ఉత్పత్తుల ధరలు భగ్గుమనడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో కొనుగోలుదారులు వేచిచూసే దోరణి అవలభించే అవకాశాలున్నాయని తెలిపింది. ప్రస్తుతం ద్విచక్ర వాహన ఇండస్ట్రీ ఆశాజనక పనితీరు కనబరుస్తున్నప్పటికీ భవిష్యత్తులో డిమాండ్ పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించింది. ఈ రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటున్నదని, వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, సరఫరా వ్యవస్థ కోసం అధికంగా నిధులు వెచ్చించడంతో వాహన తయారీ సంస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని పేర్కొన్నది. ఇంధన ధరలు భగ్గుమనడంతో విద్యుత్తుతో నడిచే వాహనాలకు ఎనలేని డిమాండ్ నెలకొన్నది. మే నెలలో దేశీయంగా 1,72,148 యూనిట్ల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 71.7 శాతం అధికం. ఒకే నెలలో ఇంతటిస్థాయిలో అమ్ముడవడం ఇదే తొలిసారి.

# వైభవ్ విధ్వంసానికి కుదేలైన శ్రీలంక..
# ముక్కోణపు వన్డే సిరీస్ టీమిండియాదే..!

ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత ఏ జట్టు జయభేరి మోగించింది. దంబుల్లా వేదికగా జరిగిన ఫైనల్లో శ్రీలంక ఏ జట్టును టీమిండియా చిత్తు చేసింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(94) తుఫాన్ ఇన్నింగ్స్‌తో కుదేలైన లంక.. గట్టిగానే పోరాడింది. వనుజ సహన్(62), సమరవిక్రమ (52)లు అర్థ శతకాలతో రాణించినా సరిపోలేదు. యశ్ ఠాకూర్(3-45), అనుకుల్ రాయ్(39, 2-42) ఆల్‌రౌండ్ షో తోడవ్వగా 66 పరుగుల తేడాతో టీమిండియా విజేతగా నిలిచింది. మూడు దేశాల వన్డే సిరీస్ ఫైనల్లో టీమిండియా ఏ ధాటికి శ్రీలంక ఏ జట్టు చేతులెత్తేసింది. 378 పరుగుల ఛేదనను ధాటిగా ఆరంభించాలనుకున్న లంకను యశ్ ఠాకూర్(3-45) ఆదిలోనే దెబ్బకొట్టాడు. ఠాకూర్ విజృంభణతో 75కే మూడు వికెట్లు కోల్పోయిన లంకను సమరవిక్రమ(52), రవిందు ఫెర్నాండో(19) అదుకున్నారు. ఈ జోడీని తిలక్ వర్మ విడదీయగా.. సహన్ అరాచ్చిగే(38), వనుజ సహన్(62)లు కాసేపు ప్రతిఘటించారు. అయితే.. విప్రజ్ నిగమ్(), అనుకుల్ రాయ్(39, 2-42) ఆల్‌రౌండ్ షో తోడవ్వగా 66 పరుగుల తేడాతో టీమిండియా విజేతగా నిలిచింది

**వైభవ్ ఊచకోత**



ఫైనల్లో భారత ఏ జట్టు మొదట కొండంత స్కోర్ కొట్టింది. శ్రీలంక బౌలర్లను భయపెడుతూ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(94) కేవలం 11 బంతుల్లోనే అర్థ శతకంతో చెలరేగాడు. పవర్ ప్లేలోనే వైభవ్ ఊచకోతతో అలవోకగా టీమిండియా నాలుగొందలు కొడుతుందనిపించింది. కానీ, కెప్టెన్ తిలక్ వర్మ(67) మినహా ఎవరూ రాణించలేదు. .మిడిలార్డర్ వైఫల్యం, డెత్ ఓవర్లలో భారత ఆటగాళ్లను లంక పేసర్లు గొప్పగా కట్టడి చేశారు. కుమార్ కుషగ్ర(39), ఆఖర్లో అనుకుల్ రాయ్(39) మెరుపులతో భారత ఏ జట్టు 9 వికెట్ల నష్టానికి 377 పరుగులతో లంకకు సవాల్ విసిరింది.

### 11 వికెట్లతో రెచ్చిపోయిన హెన్రీ..
### భారీ విజయంతో సిరీస్‌లో నిలిచిన న్యూజిలాండ్..!

సొంత గడ్డపై ఇంగ్లండ్‌కు ఘోర పరాభవం ఎదురైంది. లార్డ్స్‌లో ఘన విజయంతో జోరుమీదున్న ఆ జట్టుకు న్యూజిలాండ్ బిగ్ షాకిచ్చింది. కెన్నింగ్టన్ ఓవల్‌లో మ్యాట్ హెన్రీ (5-80-6-29) పేస్ ధాటికి ఇంగ్లండ్ బ్యాటర్లు తోకముడిచారు. తొలి ఇన్నింగ్స్‌లోనే దెబ్బకొట్టిన హెన్రీ రెండో ఇన్నింగ్స్‌లోనూ చెలరేగడంతో ఆతిథ్య జట్టు చతికిలపడింది. జో రూట్(77) పోరాడినా.. జోర్డాన్ కాక్స్ చివరి వికెట్‌గా వెనుదిరిగడంతో 253 పరుగుల తేడాతో గెలుపొందిన కివీస్ 1-1తో సిరీస్ సమం చేసింది. కెన్నింగ్టన్ ఓవల్‌లో న్యూజిలాండ్ పంజా విసిరింది. లార్డ్స్‌లో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకుంటూ ఇంగ్లండ్‌పై భారీ విజయంతో సిరీస్‌లో నిలిచింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఆతిథ్య జట్టును కూల్చిన మ్యాట్ హెన్రీ కివీస్‌కు చిరస్మరణీయ విక్టరీ అందించాడు. అంతేకాదు దివంగత షేన్ వార్న్ అనంతరం ఓవల్‌లో పది వికెట్లు తీసిన బౌలర్‌గా ఈ పొడగరి పేసర్ రికార్డుకెక్కాడు.



**291 పరుగులకే**

సుదీర్ఘ ఫార్మాట్‌లో నిలకడ తప్పితే ఓటమి ఖాయం అని ఇంగ్లండ్ నిరూపించింది. రెండో టెస్టులో న్యూజిలాండ్‌కు కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో గ్లెన్ ఫిలిప్స్(100) శతకంతో భారీ స్కోర్ కొట్టిన న్యూజిలాండ్.. మ్యాట్ హెన్రీ(5-80) విజృంభణతో ఇంగ్లండ్‌ను 291 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో హెన్రీ నికోలస్(121) సెంచరీతో కదం తొక్కగా కివీస్ 362 పరుగులతో ఆతిథ్య జట్టుకు సవాల్ విసిరింది. భారీ ఛేదనలో హెన్రీ(6-29) చెలరేగడంతో రూట్ సేన తట్టుకోలేకపోయింది. జట్టును ఆదుకునేందుకు హ్యారీ బ్రూక్(58), రూట్ ఎంత ప్రయత్నించినా.. మిగతావారు నిలబడలేదు. ఫలితంగా.. ఇంగ్లండ్‌కు 253 పరుగల ఓటమి తప్పలేదు. నిర్ణయాత్మకమైన మూడో టెస్టు జూన్ 25న నాటింగ్‌హామ్‌లో జరుగనుంది.

## స్పోర్ట్స్

### న్యూజిలాండ్‌కు షాక్..
### ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్ విజేతగా టీమిండియా..!



ఆసియా క్రీడలకు ముందే భారత మహిళల హాకీ జట్టు అదరగొట్టింది. ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో తమకు తిరుగులేదని చాటుతూ ట్రోఫీని కొల్లగొట్టింది. ఆదివారం జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత్ రెండోసారి కప్‌ను ఒడిసిపట్టింది. టైటిల్ పోరులో నవ్‌నీత్ కౌర్, సునేలిటా టొప్పోలు చెరొక గోల్ కొట్టగా.. 2-0తో కివీస్ మట్టికరిచింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత జట్టు టైటిల్ పట్టేసింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను టీమిండియా 2-0తో ఓడించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో నవనీత్ కౌర్ 4వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టగా భారత్ 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఖాతా తెరిచేందుకు కివీస్ జట్టు ఎంతగానో ప్రయత్నించినా భారత డిఫెండర్లు ఏమాత్రం అవకాశమివ్వలేదు. ప్రత్యర్థికి షాకిస్తూ సునేలిటా టొప్పో 15వ నిమిషంలో గోల్‌తో టీమిండియా స్పష్టమైన ఆధిపత్యం చెలాయించింది. ఫైనల్లో అద్భుతంగా రాణించిన ఫార్వర్డ్ లల్రేమ్సియామి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికైంది. టోర్నీ ఆసాంతం గొప్పగా ఆడిన దీపిక ఆరు గోల్స్‌తో అమెరికా ప్లేయర్ అష్లే సెస్సాతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును పంచుకుంది.



# చంచల్‌గూడ జైలుకు ప్రభాస్.. 'స్పిరిట్' కీలక షెడ్యూల్ షురూ!

రెబల్ స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'స్పిరిట్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన షెడ్యూల్ ఆదివారం నుంచి హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో మొదలుకానుంది. ఈ షెడ్యూల్‌లో హీరో ప్రభాస్ స్వయంగా పాల్గొనబోతున్నట్లు సమాచారం. కథలో ఎంతో కీలకమైన సన్నివేశాలను ఈ జైలు లొకేషన్‌లో చిత్రీకరించేందుకు చిత్ర యూనిట్ ప్లాన్ చేసింది. హై వోల్టేజ్ డ్రామా, యాక్షన్ సీక్వెన్స్‌లుగా సాగే ఈ సీన్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని ఇండస్ట్రీ టాక్. సందీప్ రెడ్డి వంగా మార్క్ మేకింగ్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్ పూర్తవగానే ప్రస్తుత షూటింగ్ ఫేజ్ ముగుస్తుంది. వెంటనే ఎలాంటి బ్రేక్ లేకుండా తర్వాతి షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'స్పిరిట్'పై ప్రభాస్ ఫ్యాన్స్‌లో ఇప్పటికే భారీ హైప్ నెలకొంది.



# 'సింగ్ గీతం'కు ఫ్యామిలీ ఆఫర్.. తెలంగాణ మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధర తగ్గింపు!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు 61వ చిత్రంగా తెరకెక్కిన 'సింగ్ గీతం' సినిమా విమర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకున్న సంగతి తెలిసిందే. నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ చిత్రంలో అయాన్, అహల్య ప్రధాన పాత్రల్లో నటించారు. అయితే సినిమాకు వచ్చిన పాజిటివ్ రెస్పాన్స్ నేపథ్యంలో మేకర్స్ తెలంగాణలోని మల్టీప్లెక్స్‌ల్లో టికెట్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటివరకు రూ.200గా ఉన్న టికెట్ ధరను రూ.175కు తగ్గించారు. ఫ్యామిలీ ఆడియన్స్‌కు సినిమా మరింత అందుబాటులో ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు పలువురు సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించగా, తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ కూడా సపోర్ట్ చేస్తూ ప్రమోట్ చేశారు. ఈ పాజిటివ్ ఎండార్స్‌మెంట్స్, టికెట్ ధర తగ్గింపు వీక్ డేస్‌లో సినిమా వసూళ్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి. ఈ చిత్రంలో శాలిని కొండెపూడి, నివేదా పేతురాజ్, శివన్నారాయణ, బెనర్జీ, తులసి శివమణి, అగు స్టాన్లీ చియెడోజీ కీలక పాత్రల్లో కనిపించారు. విజయ్ దేవరకొండ స్పెషల్ క్యామియోలో మెరిశారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.



# లాభాల్లోకి సామ్ సినిమా.. 'బంగారం' వసూళ్లు ఎంతంటే?

చాన్నాళ్ల తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో వచ్చిన సమంత.. బాక్సాఫీస్ దగ్గర రచ్చ చేస్తోంది. టాక్ ఓ మాదిరిగా వచ్చినప్పటికీ, స్కూల్స్ కూడా తెరిచేసినప్పటికీ ఫ్యామిలీ ఈ మూవీ చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అదంతా కలెక్షన్స్ రూపంలో కనిపిస్తోంది. రెండు రోజుల్లో ఊహించని వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలని ఆశ్చర్యపరుస్తోంది. ఇంతకీ ఎన్ని కోట్లు వచ్చాయి? సమంత ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'మా ఇంటి బంగారం'. ఇందులో హీరో ఎవరూ లేరు. నందిని రెడ్డి దర్శకత్వం వహించగా.. సామ్ భర్త రాజ్ నిడిమోరు, స్టోరీ అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించారు. విడుదలకు ముందు ఓ మాదిరి హైప్ ఉన్నప్పటికీ థియేటర్లలోకి సినిమా వచ్చిన తర్వాత మంచి వసూళు రాబడుతోంది. తొలిరోజు రూ.13.15 కోట్ల గ్రాస్ రాగా.. రెండు రోజులకు కలిపి రూ.28 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. అంటే రెండో రోజు ఏకంగా దాదాపు రూ.15 కోట్లు వచ్చినట్లే. ఈ నంబర్స్ బట్టి సమంత సినిమా.. తొలి రెండు రోజుల్లోనే లాభాల్లోకి వచ్చేసింది. ఈ సినిమా సక్సెస్ అవడంతో పాటు సమంత జీవితంలోనూ మరో ముందడుగు వేసింది. ప్రస్తుతం ఈమె ప్రెగ్నెన్సీతో ఉంది. శనివారం జరిగిన సక్సెస్ సెలబ్రేషన్‌లో బేబీ బంప్‌తో కనిపించింది. ఈ ఏడాది డిసెంబరులోనే బిడ్డకు జన్మనివ్వబోతుందని కూడా మాట్లాడుకుంటున్నారు. గతేడాది డిసెంబరులో దర్శకుడు రాజ్ నిడిమోరుని సమంత పెళ్లి చేసుకుంది.

# 'చెన్నై లవ్ స్టోరీ'తో మరో బ్లాక్‌బస్టర్ ఖాయం..



యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా తిరుపతిలో నిర్వహించిన 'జిగితార' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం చేసిన వ్యాఖ్యలు మరింత హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సందర్భంగా మాట్లాడిన కిరణ్ అబ్బవరం, 'క' సినిమా మంచి విజయాన్ని సాధించిందని, 'కె ర్యాంప్'తో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నామని, ఇప్పుడు 'చెన్నై లవ్ స్టోరీ' కూడా అదే స్థాయిలో విజయాన్ని అందుకుంటుందని పూర్తి నమ్మకంతో చెప్పారు. 'చెన్నై లవ్ స్టోరీ'లో తన పాత్ర ఇప్పటివరకు చేసిన సినిమాల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుందని కిరణ్ తెలిపారు. ఈ సినిమా కథ విన్నప్పుడు తన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు గుర్తొచ్చాయని, ఆ కారణంగా ఈ కథతో చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యానని చెప్పారు. ఈ సినిమా నా జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను గుర్తు చేసింది. చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యాను. ప్రేక్షకులు కూడా ఈ కథకు కనెక్ట్ అవుతారని నమ్ముతున్నాను అని కిరణ్ పేర్కొన్నారు.

# బిగ్‌బాస్ 10లోకి జబర్దస్త్ బ్యూటీ

## సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం!



తెలుగు బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'బిగ్‌బాస్ తెలుగు' పదో సీజన్‌కు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే విజయవంతంగా తొమ్మిది సీజన్లు పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు ల్యాండ్‌మార్క్ సీజన్‌గా పదో సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. మేకర్స్ వరుస ప్రోమోలు, అప్‌డేట్స్‌తో ఆసక్తిని పెంచుతుండగా, కంటెస్టెంట్ల ఎంపికపై కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం 'బిగ్‌బాస్ తెలుగు 10' ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈసారి కూడా సెలబ్రిటీలతో పాటు సామాన్యులకు అవకాశం కల్పిస్తూ 'అగ్నిపరీక్ష 2' ద్వారా కంటెస్టెంట్లను ఎంపిక చేయనున్నారు. పదో సీజన్ కావడంతో హౌస్‌లో అనేక సర్‌ప్రైజ్‌లు, కొత్త గేమ్స్, వినూత్న టాస్కులు, భిన్నమైన కాన్సెప్ట్‌లు ఉండనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ సీజన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే పలువురు టీవీ నటులు, యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పేర్లు బిగ్‌బాస్ కంటెస్టెంట్ల జాబితాలో వినిపిస్తున్నాయి. పల్లవి గౌడ, తేజస్విని గౌడ, నందూస్ వరల్డ్ ఫేమ్ నందన, వాసంతి కృష్ణన్ కుటుంబ సభ్యులు, ఎక్స్‌ప్రెస్ హరి, నూకరాజు, రాకింగ్ రాకేష్, జ్యోతి, రాయల్ మెక్ రమణ, శివ్, కడలి సత్యనారాయణ, జబర్దస్త్ వర్ష, వర్షిణి, ప్రభాకర్ లేదా చంద్రహాస్ వంటి పేర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈ జాబితాలో తాజాగా మరో పేరు బలంగా వినిపిస్తోంది. ఆమెనే జబర్దస్త్ లేడీ కమెడియన్ పవిత్ర. జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి పలు కామెడీ షోల ద్వారా మంచి గుర్తింపు సంపాదించుకున్న పవిత్ర ప్రస్తుతం బిగ్‌బాస్ సీజన్ 10లో పాల్గొనే అవకాశాలు ఉన్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు బ్యూటీ పార్లర్‌లో పనిచేసిన పవిత్ర, తన ప్రతిభతో, కష్టంతో బుల్లితెరపై ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కామెడీ టైమింగ్, ఎనర్జీ, సహజమైన ప్రవర్తనతో ఆమె ప్రేక్షకులకు దగ్గరయ్యారు. గతంలో కూడా పవిత్ర పేరు బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా పలుమార్లు వినిపించింది. అయితే ఈసారి మాత్రం ఆమె హౌస్‌లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోషల్ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బిగ్‌బాస్ టీమ్ ఆమెతో చర్చలు జరిపినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పవిత్ర నిజంగానే బిగ్‌బాస్ హౌస్‌లోకి అడుగుపెడితే ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవ ఉండదని అభిమానులు భావిస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,